


PRGI NO: TGTEL/25/A5314

# అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్




మంచిర్యాల హైదరాబాద్ రంగారెడ్డి | epaper.arjun saamaacharam.com | బుధవారం 5, ఆగస్టు 2026 | సంపుటి :1 సంచిక : 207 | పేజీలు : 8 , వెల.2.00





సీఎం, త్రిషపై అనుచిత వ్యాఖ్యలు..

## ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్..

తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్, హీరోయిన్ త్రిషపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో ప్రతిపక్ష డీఎంకే పార్టీ నేత ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్ అయ్యారు. మంగళవారం తంజావూర్ పోలీసులు చెన్నై, నీలాంగరైలోని నివాసంలో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. వ్యానులో ఉదయనిధిని తంజావూర్ తరలిస్తున్నట్లు సమాచారం.

2



కామన్‌వెల్త్ క్రీడలకు

## ఆతిథ్యమిచ్చేందుకు హర్యానాకు ఛాన్స్ ఇవ్వాలి: కాంగ్రెస్ ఎంపీ

కామన్‌వెల్త్ క్రీడలకు ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని హర్యానాకు ఇవ్వాలని రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటు కాంప్లెక్స్ ముందు నిరసనకు దిగారు. ఇతర రాష్ట్రాలతో కలిసి సంయుక్తంగా ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని అయినా ఇవ్వాలని కోరారు. భారత క్రీడావిజయాల్లో హర్యానా పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. కాబట్టి, 2030లో జరగనున్న కామన్‌వెల్త్ క్రీడలకు ఆతిథ్యమిచ్చే అవకాశం తమకు దక్కాలని చెప్పారు.

2



రాజీనామా చేస్తానంటే..

## వెంటనే ఓకే చేస్తా.. అసంతృప్తులపై కర్ణాటక సీఎం వ్యాఖ్య

ఇటీవల కర్ణాటక కేబినెట్ విస్తరణ నేపథ్యంలో మంత్రిగా అవకాశం దక్కని అనేక మంది ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నేపథ్యంతో సీఎం డీకే శివకుమార్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. అవకాశాలు వచ్చే వరకూ సహనంతో ఉండాలని హితవు పలికారు. ఎవరైనా రాజీనామా చేస్తానంటే నిమిషాల్లో ఒకే చేస్తానని కూడా తేల్చి చెప్పారు. తాజా కేబినెట్ విస్తరణలో 20 మంది ఎమ్మెల్యేలకు అవకాశం దక్కిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన రెండు నెలలకు సీఎం డీకే తన కేబినెట్‌ను విస్తరించారు.కేబినెట్‌లో చోటు దక్కక అసంతృప్తితో ఉన్న వారిని ఉద్దేశించి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'రిజైన్ చేస్తానన్న వారంతా రాజకీయాలు చేస్తున్నట్టే. రాజీనామా చేస్తాననే వారిని ఎవ్వరూ ఆపలేరు.

2

సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్

# ఇంటర్నెట్

- ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి కనెక్టివిటీ కల్పించాలి
- ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్ ఏర్పాటు లక్ష్యంగా ఈ నిర్ణయం
- ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి
- ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక టీ-ఫైబర్ కనెక్టివిటీ
- 'ఇంటింటికీ ఇంటర్నెట్' మరింత వేగవంతం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

2లో



లోక్‌సభలో కొనసాగిన విపక్షాల

## ఆందోళన.. రెండు బిల్లులకు ఆమోదం



2

నీట్ పేపర్ లీకేజీ అంశం, రామాలయ విరాళాల చోరీ ఘటనలు లోక్‌సభను ఇవాళ కూడా స్తంభింపజేశాయి. సభ సజావుగా సాగనివ్వాలని స్పీకర్ ఓం బిర్లా విపక్ష సభ్యులను కోరగా.. వారు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. నినాదాలతో సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. అయితే.. ఈ ఆందోళనల నడుమే కేంద్రం రెండు బిల్లులను ప్రవేశపెట్టింది. ట్యాక్సేషన్ ఇతర చట్టాల సవరణ బిల్లు, అప్రప్రియేషన్ బిల్లు-2026ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సభలో ప్రవేశపెట్టారు.

2



## విద్యా వ్యవస్థను సీఎం రేవంత్ నాశనం చేస్తున్నారు: ఎంపీ అర్వింద్

ఇంజనీరింగ్ విద్యార్థులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ఖండించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా సీఎం వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్య పట్ల చిత్తశుద్ధి లేని వ్యక్తి విద్యాశాఖ మంత్రిగా ఉండటం సరైనది కాదని అన్నారు.

హరీశ్ రావు క్షుద్ర పూజలు

## చేస్తున్నారు: టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అందుకు తమ వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అరుంధతి సినిమా తరహాలో ఆయన పూజలు నిర్వహిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు.



2

## ఇజ్రాయెల్‌కున్న గొప్ప స్నేహితుల్లో మోదీ ఒకరు: బెంజమిన్ నెతన్యాహు

2





2

మత్స్యకారుల సంక్షేమానికి పూర్తి

## ప్రాధాన్యం: మంత్రి వాకిటి శ్రీహరి

మత్స్యకారుల సంక్షేమంపై మంత్రి వాకిటి శ్రీహరి కీలక సమావేశం నిర్వహించారు. మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, ప్రమోటర్లతో చర్చలు జరిపారు. 26 వేల చెరువులు, 100 రిజర్వాయర్లలో చేపల పెంపకంపై ప్రత్యేకంగా దృష్టిసారించనున్నారు. మత్స్యకారులకు ఇన్సూరెన్స్, మోపెడ్‌లు, రిటైల్ షాపుల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. ప్రతి మూడు నెలలకు మత్స్యకార సంఘాల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం, చర్చించారు.

# సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ ఇంటర్నెట్



## ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి కనెక్టివిటీ కల్పించాలి

## ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్ ఏర్పాటు లక్ష్యంగా ఈ నిర్ణయం

## ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి

## ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక టీ-ఫైబర్ కనెక్టివిటీ

## 'ఇంటింటికీ ఇంటర్నెట్' మరింత వేగవంతం

## ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

హైదరాబాద్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని అధికారులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో టీ-ఫైబర్ సేవల విస్తరణపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్ణీత గడువులోగా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తూ బిల్లులు చెల్లించవద్దని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ నిధుల ఆదాతో పాటు ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్ ఏర్పాటు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విభాగాలు వినియోగిస్తున్న టీ-స్వాన్ (౧-రాజౌచీ) నెట్‌వర్క్‌ను వచ్చే నెల రోజుల్లో పూర్తిగా టీ-ఫైబర్‌కు బదిలీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీధర్ బాబు ఆదేశించారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఇంటింటికీ ఇంటర్నెట్' కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి గ్రామీణ ప్రాంతాల వరకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ కలిగిన రాష్ట్రంగా తీర్చిది ద్దాలన్నారు. ఇందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

# లోక్‌సభలో కొనసాగిన విపక్షాల ఆందోళన.. రెండు బిల్లులకు ఆమోదం

ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

నీట్ పేపర్ లీకేజీ అంశం, రామాలయ విరాళాల చోరీ ఘటనలు లోక్‌సభను ఇవాళ కూడా స్తంభింపజేశాయి. సభ సజావుగా సాగనివ్వాలని స్పీకర్ ఓం బిర్లా విపక్ష సభ్యులను కోరగా.. వారు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. నినాదాలతో సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. అయితే.. ఈ ఆందోళనల నడుమే కేంద్రం రెండు బిల్లులను ప్రవేశపెట్టింది. ట్యాక్సేషన్ ఇతర చట్టాల సవరణ బిల్లు, అప్రప్రియేషన్ బిల్లు-2026ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సభలో ప్రవేశపెట్టారు. దీంతో వెంటనే సభలో చర్చకు రాగా.. విపక్ష సభ్యులు ఇరు బిల్లులనూ వ్యతిరేకిస్తూ గందరగోళం సృష్టించారు. కానీ.. చివరకు మూజువాణి ఓటుతో రెండు బిల్లులూ ఆమోదం పొందాయి. ఆ తర్వాత సభను రేపటికి వాయిదా వేశారు స్పీకర్.కాగా.. నేటితో పార్లమెంట్ సమావేశాలు 12వ రోజుకు చేరుకోగా.. సభ ప్రారంభంలోనే విపక్షాలు ఆందోళనకు దిగాయి. దీంతో సభాపతి సభను తొలుత మధ్యాహ్నం 12:00 గంటలకు వాయిదా వేశారు. ఆ తర్వాత మరోసారి 2:00 గంటలకు వాయిదా పడింది. అయితే.. ఈ సారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ప్రశ్నోత్తరాల సమయం జరగకపోవడం గమనార్హం.

# సీఎం, త్రిషపై అనుచిత వ్యాఖ్యలు.. ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్..

ఇంటర్‌నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్, హీరోయిన్ త్రిషపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో ప్రతిపక్ష డీఎంకే పార్టీ నేత ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్ అయ్యారు. మంగళవారం తంజావూర్ పోలీసులు చెన్నై, నీలాంగరైలోని నివాసంలో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. వ్యానులో ఉదయనిధిని తంజావూర్ తరలిస్తున్నట్లు సమాచారం.

### నిరసన సభలో కామెంట్లు..

సోమవారం తంజావూరులో జరిగిన కావేరి జలాల నిరసన సభలో ఉదయనిధి స్టాలిన్ ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి విజయ్‌పై విమర్శలు గుప్పించారు. ఆ సమయంలో కొందరు డీఎంకే కార్యకర్తలు ఒక్కసారిగా 'త్రిష.. త్రిష' అని నినాదాలు చేశారు. దానికి ఉదయనిధి స్టాలిన్ నవ్వుతూ.. హీరోయిన్ త్రిష, సీఎం విజయ్‌లను ఉద్దేశించి అనుచితమైన డబుల్ మీనింగ్ కామెంట్లు చేశారు.ఉదయనిధి స్టాలిన్ కామెంట్లపై టీవీకే పార్టీ మహిళా విభాగం తంజావూర్ ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో తంజావూర్ పోలీసుల బృందం చెన్నై చేరుకుంది. మంగళవారం ఉదయం స్థానిక పోలీసుల సాయంతో చెన్నై, నీలాంగరైలోని నివాసం వద్ద తంజావూర్ పోలీసులు ఉదయనిధి స్టాలిన్‌ను అరెస్ట్ చేశారు.

# కామన్‌వెల్త్ క్రీడలకు ఆతిథ్యమిచ్చేందుకు హర్యానాకు ఛాన్స్ ఇవ్వాలి: కాంగ్రెస్ ఎంపీ

ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

కామన్‌వెల్త్ క్రీడలకు ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని హర్యానాకు ఇవ్వాలని రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటు కాంప్లెక్స్ ముందు నిరసనకు దిగారు. ఇతర రాష్ట్రాలతో కలిసి సంయుక్తంగా ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని అయినా ఇవ్వాలని కోరారు. భారత క్రీడావిజయాల్లో హర్యానా పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. కాబట్టి, 2030లో జరగనున్న కామన్‌వెల్త్ క్రీడలకు ఆతిథ్యమిచ్చే అవకాశం తమకు దక్కాలని చెప్పారు.ఈ నిరసనల్లో కాంగ్రెస్ ఎంపీ దీపీందర్ సింగ్ హుడాతో పాటు ఎంపీలు జైప్రకాశ్, వరుణ్ ముల్లానా, సత్‌పాల్ బ్రహ్మచారి, కర్మవీర్ బౌద్ధ కూడా పాల్గొన్నారు. హర్యానా మెడల్స్ తెస్తుంటే గుజరాత్‌లో క్రీడలు నిర్వహించడమేమిటని వారు ప్రశ్నించారు. క్రీడల వేదికపై కేంద్రం మరోసారి పునరాలోచించాలని కోరారు. హర్యానా హక్కులు సాధించుకునేందుకు తాము ప్రయత్నిస్తున్నామని చెప్పారు. హర్యానా జనాభా తక్కువైనప్పటికీ అంతర్జాతీయ క్రీడా ఈవెంట్స్‌లో అత్యధిక మెడల్స్ సాధిస్తున్న రాష్ట్రంగా నిలుస్తోందని అన్నారు. క్రీడారంగంలో యావత్ దేశంలో హర్యానా ముందుందని గుర్తు చేశారు. 2030 కామన్‌వెల్త్ క్రీడలకు ఆతిథ్యమిచ్చే అవకాశం కోసం భారత్ ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ఇందుకు కావాల్సిన మౌలిక వసతులు హర్యానాలో ఉన్నాయని రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలు చెబుతున్నారు.

# రాజీనామా చేస్తానంటే.. వెంటనే ఓకే చేస్తా.. అసంతృప్తులపై కర్ణాటక సీఎం వ్యాఖ్య

ఇంటర్నెట్ డెస్క్:

ఇటీవల కర్ణాటక కేబినెట్ విస్తరణ నేపథ్యంలో మంత్రిగా అవకాశం దక్కని అనేక మంది ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నేపథ్యంతో సీఎం డీకే శివకుమార్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. అవకాశాలు వచ్చే వరకూ సహనంతో ఉండాలని హితవు పలికారు. ఎవరైనా రాజీనామా చేస్తానంటే నిమిషాల్లో ఒకే చేస్తానని కూడా తేల్చి చెప్పారు. తాజా కేబినెట్ విస్తరణలో 20 మంది ఎమ్మెల్యేలకు అవకాశం దక్కిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన రెండు నెలలకు సీఎం డీకే తన కేబినెట్‌ను విస్తరించారు.కేబినెట్‌లో చోటు దక్కక అసంతృప్తితో ఉన్న వారిని ఉద్దేశించి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'రిజైన్ చేస్తానన్న వారంతా రాజకీయాలు చేస్తున్నట్టే. రాజీనామా చేస్తాననే వారిని ఎవ్వరూ ఆపలేరు. కానీ వారికి ఒక పార్టీ కావాలి. పార్టీలో భవిష్యత్తు కావాలి. అలాంటివి ఇచ్చేది తమ పార్టీ ఒక్కటే. ధరమ్ సింగ్ సమయంలో నేను రాజీనామా చేసుండొచ్చు. ఆ తరువాత కూడా అలాంటి పరిస్థితులు వచ్చాయి. సిద్ధరామయ్య సమయంలో కూడా ఈ పరిస్థితి ఉంది. ఆ సమయాల్లో నేను ఓర్పుతో ఉండలేదా? వీరేంద్ర పాటిల్ హయాంలో బంగారప్పకు అవకాశం దక్కలేదు. ఖర్గే సాబ్‌కు అవకాశం రాలేదు. ఒకసమయంలో ధరమ్ సింగ్‌కు ఛాన్స్ రాలేదు. వారిలో కొందరు ఆ తరువాత సీఎంలు కాలేదా? ఇలాంటి సమయాల్లో ఓర్పుతో ఉండాలి. పార్టీ మనకు చాలా ముఖ్యం' అని అన్నారు. ఇక అసంతృప్తి ఎమ్మెల్యేలను బుజ్జగించే పనిని పార్టీ సీనియర్ లీడర్లకు సీఎం అప్పగించారు.

# ఇజ్రాయెల్‌కున్న గొప్ప స్నేహితుల్లో మోదీ ఒకరు: బెంజమిన్ నెతన్యాహు

ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి ఇజ్రాయెల్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అన్నారు. తనకున్న అత్యంత సన్నిహిత మిత్రుల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఒకరు అని, భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.ప్రపంచ వేదికపై ఇజ్రాయెల్‌కు బలమైన మద్దతు అందిస్తున్న దేశాల్లో భారత్ కీలకమైనదని నెతన్యాహు చెప్పారు. ఇజ్రాయెల్ ఒంటరిగా ఉందనే ప్రచారం వాస్తవం కాదని నెతన్యాహు స్పష్టం చేశారు. భారత్‌తో పాటు పలు దేశాలతో ఇజ్రాయెల్ దౌత్య, ఆర్థిక, సాంకేతిక, భద్రతా రంగాల్లో సహకారం పెరుగుతోందని చెప్పారు. ఇక, భారత్‌లో ఇజ్రాయెల్‌కు లభిస్తున్న ఆదరణ ఎంతో విలువైనదని ఆయన అన్నారు. భారత్-ఇజ్రాయెల్ మధ్య రక్షణ, వ్యవసాయం, సాంకేతికత, సైబర్ భద్రత, ఆవిష్కరణలు వంటి అనేక రంగాల్లో ఇప్పటికే బలమైన భాగస్వామ్యం కొనసాగుతోంది ఇటీవలి కాలంలో ఇరు దేశాల నాయకుల మధ్య సన్నిహిత సంబంధాలు మరింత బలపడటంతో వ్యూహాత్మక సహకారం కూడా వేగంగా విస్తరిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధాని మోదీ, ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లి పలు కీలక ఒప్పందాలు చేసుకున్న సంగతి తెలిసిందే.

# విద్యా వ్యవస్థను సీఎం రేవంత్ నాశనం చేస్తున్నారు: ఎంపీ అర్వింద్

న్యూఢిల్లీ: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

ఇంజనీరింగ్ విద్యార్థులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ఖండించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా సీఎం వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్య పట్ల చిత్తశుద్ధి లేని వ్యక్తి విద్యాశాఖ మంత్రిగా ఉండటం సరైనది కాదని అరవింద్ అన్నారు. విద్యాశాఖ బాధ్యతలను మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తే బాగుంటుందని సూచించారు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ అరవింద్ సవాల్ విసిరారు. ఎవరి సహకారం లేకుండా రేవంత్ రెడ్డి నామినేషన్ పత్రాలు నింపగలరా అని ప్రశ్నించారు.రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కూడా లేవని అరవింద్ ఆరోపించారు. కొన్ని పాఠశాలల్లో బ్లాక్ బోర్డులు, చాక్ పీసులు, విద్యార్థులకు సరైన మరుగుదొడ్లు లేని పరిస్థితి ఉందన్నారు. విద్యాశాఖ మంత్రిగా సీఎం ఒక్క ప్రభుత్వ పాఠశాలను అయినా సందర్శించారా అని ప్రశ్నించారు. ఉన్న పాఠశాలలను అభివృద్ధి చేయకుండా కొత్త పాఠశాలల నిర్మాణం పేరుతో ప్రభుత్వం కమిషన్ల కోసం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీ అరవింద్ డిమాండ్ చేశారు.

# హరీశ్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారు: టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

హైదరాబాద్:

బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అందుకు తమ వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అరుంధతి సినిమా తరహాలో ఆయన పూజలు నిర్వహిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీశ్ రావు ఈ ఏడాది మార్చి 2న తమిళనాడులోని తిరుచ్చికి, జూన్ 1న కర్ణాటకలోని శివమొగ్గకు వెళ్లారని.. ఆ తేదీల్లో ఆయన ఎక్కడ ఉన్నారో ప్రజలకు వివరించాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు.తిరుపతికి వెళ్లినప్పుడు మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. అఘోరీ ఆలయానికి వెళ్లిన విషయాన్ని ఎందుకు గోప్యంగా ఉంచారని టీపీసీసీ చీఫ్ ప్రశ్నించారు. తెలంగాణలో వర్షాలు పడకూడదని, కరువు రావాలని కోరుకుంటూ ఆయన క్షుద్ర పూజలు చేశారని మహేశ్ గౌడ్ ఆరోపించారు. ప్రజల సంక్షేమం కోసం దేవుడిని ప్రార్థించడం సహజమని.. కానీ మాజీ మంత్రి మాత్రం ప్రజలకు కీడు జరగాలని పూజలు చేశారని విమర్శించారు. తన రాజకీయ స్వార్థం కోసమే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై నిజాలు బయటపెట్టినందుకే అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్‌లకు లీగల్ నోటీసులు పంపించారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అయితే లీగల్ నోటీసులకు తాము భయపడబోమని స్పష్టం చేశారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అఘోరాలతో క్షుద్ర పూజలు చేశారనే ప్రచారం గతంలో జరిగిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ చెప్పారు. ఇప్పుడు హరీశ్ రావుపై వస్తున్న ఆరోపణలతో కేసీఆర్ పూజలు కూడా నిజమేనని అనిపిస్తోందన్నారు. యాదగిరిగుట్టకు వెళ్లి పొర్లు దండాలు పెట్టి మరీ ఏం చేశారో ప్రజలకు హరీశ్ రావు చెప్పాలని ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. గతంలో మంత్రాలు, తంత్రాల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన ఘటనలు ఉన్నాయని, దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఇలాంటి ఆచారాలను బలంగా నమ్ముతారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. కాగా, టీపీసీసీ చీఫ్ ఆరోపణలపై హరీశ్ రావు, బీఆర్ఎస్ నుంచి ఎలాంటి స్పందన వస్తుందో వేచి చూడాలి.

# మత్స్యకారుల సంక్షేమానికి పూర్తి ప్రాధాన్యం: మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్,

మత్స్యకారుల సంక్షేమంపై మంత్రి వాకిటి శ్రీహరి కీలక సమావేశం నిర్వహించారు. మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, ప్రమోటర్లతో చర్చలు జరిపారు. 26 వేల చెరువులు, 100 రిజర్వాయర్లలో చేపల పెంపకంపై ప్రత్యేకంగా దృష్టిసారించనున్నారు. మత్స్యకారులకు ఇన్సూరెన్స్, మోపెడ్‌లు, రిటైల్ షాపుల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. ప్రతి మూడు నెలలకు మత్స్యకార సంఘాల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం, ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం కొనసాగింపుపై సమావేశంలో చర్చించారు. పెండింగ్ బకాయిల విడుదలకు ప్రత్యేకంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. మధ్యాహ్న భోజనంలో చేపలను చేర్చే ప్రతిపాదన పరిశీలనలో ఉందన్నారు. సభ్యత్వ వివాదాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కోహెడ ఇంటిగ్రేటెడ్ ఫిష్ మార్కెట్ నిర్మాణం కొనసాగుతోందన్నారు. ఆన్‌లైన్‌లో చేపల విక్రయాలకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ దోహదం చేస్తుందని చెప్పుకొచ్చారు. రూ. 1.34 కోట్ల ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లను ప్రభుత్వం క్లియర్ చేసిందన్నారు. మత్స్య సహకార సంఘాల అధ్యక్షుల ప్రోటోకాల్ అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.



# కర్నాటక కాంగ్రెస్‌లో విస్తరణ చిచ్చు

### 20 మంది కొత్త మంత్రుల ప్రమాణం

### చోటు దక్కని పలువురు ఎమ్మెల్యేల ఆగ్రహం

### అసమ్మతి నేతల ఆందోళనలు..ధర్నాలు

### ఎమ్మెల్యే యశ్వంతరాయ గౌడ పాటిల్ రాజీనామా

బెంగళూరు,

కర్ణాటక ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మంత్రివర్గ విస్తరణ రాష్ట్ర కాంగ్రెస్‌లో చిచ్చు రేపింది. ఆగ్రహావేశాలు, ఆనందోత్సాహాలను చవిచూడాల్సి వచ్చింది. కొందరిలో విపరీతమైన ఆనందోత్సాహానికి, మరికొందరిలో తీవ్ర ఆగ్రహావేశాలకు కారణమైంది. ఏకంగా 20 మంది కొత్త మంత్రుల ప్రమాణస్వీకారంతో ఒకవైపు పండుగ వాతావరణం సంతరించుకోగా, మరోవైపు తీవ్ర అసమ్మతి, ధర్నాలు, ఆందోళనలకు దారితీసింది. కేబినెట్‌లో చోటు దక్కకపోవడంతో అసమ్మతి నేతలు బహిరంగంగానే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పదవి దక్కకపోవడంపై తీవ్ర మనస్థాపానికి గురైన ఎమ్మెల్యే యశ్వంతరాయ గౌడ పాటిల్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 'పార్టీ నాయకత్వం నన్ను తీవ్రంగా గాయపరిచింది. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను' అని ఆయన పేర్కొన్నారు. అలాగే బేలూరు ఎమ్మెల్యే గోపాలకృష్ణ కూడా రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, మైసూర్ నాయకుడు తన్వీర్ సేట్‌కు మంత్రివర్గంలో చోటు నిరాకరించడంతో, ఆయన మద్దతుదారుడొకరు మైసూరులో విషం తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. అతన్ని ప్రస్తుతం ఆసుపత్రికి తరలించగా, తన్వీర్ సేట్ నేరుగా వెళ్లి

పరామర్శించారు. ధార్వాడ్‌లో ప్రసాద్ అబ్బయ్య మద్దతుదారులు రహదారిపై టైర్లు కాల్చి, ప్రభుత్వ బస్సుపై రాళ్ళు రువ్వి ఆందోళన చేపట్టారు. అసమ్మతి నేతల రహస్య భేటీ: హెచ్‌కే పాటిల్, దినేష్ గుండూరావుతో సహా పదవులు దక్కని సీనియర్ నాయకులు బెంగళూరులోని పీ.వీ. జయచంద్ర నివాసంలో అత్యవసర రహస్య సమావేశం ఏర్పాటు చేసి తదుపరి కార్యాచరణపై చర్చిస్తున్నారు. మంత్రి మునియప్ప అసంతృప్తి: మరోవైపు సీనియర్ నేత, కేబినెట్ మంత్రి కె. హెచ్. మునియప్ప కూడా తన శాఖ కేటాయింపుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, శాఖను మార్చాలని కోరుతున్నట్లు సమాచారం. ప్రమాణస్వీకారానికి కొన్ని గంటల ముందు కేబినెట్ జాబితాలో నాటకీయ మార్పులు చోటుచేసుకున్నాయి. తొలుత ప్రకటించిన ముసాయిదా నుంచి మంకాల్ వైద్య, గాయత్రి చంద్రశేఖర్‌లను తొలగించి, ఆఖరి నిమిషంలో సీనియర్ నేత ఎస్.ఎస్. మల్లికార్జున్‌కు కేబినెట్‌లో స్థానం కల్పించారు. కర్ణాటక కాంగ్రెస్ విస్తరణపై బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయా తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ చెబుతున్న సామాజిక న్యాయం, మహిళా సాధికారత మాటలకే పరిమితమని ఎద్దేవా చేశారు. కేబినెట్‌లో ఏకైక మహిళకే చోటు ఇవ్వడం, బ్రాహ్మణ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం లేకపోవడం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న బి. నాగేంద్ర, జమీర్ అహ్మద్ ఖాన్‌లను తిరిగి కేబినెట్‌లోకి తీసుకోవడం కాంగ్రెస్ డొల్లతనాన్ని బయటపెడుతోందని ఆరోపించారు.



## బీహార్‌లో బిజెపికి అతిపెద్ద షాక్

### బంకీపూర్ అసెంబ్లీలో ప్రశాంత్ కిశోర్ భారీ విజయం

### 30 ఏళ్ల కంచుకోటను బద్దలు కొట్టిన ప్రశాంత్

పాట్నా,

బిహార్‌లో సరికొత్త రాజకీయం ఆవిష్కృతం అయ్యింది. అలాగే బిజెపికి అతిపెద్ద షాక్ తగిలింది. బంకీపూర్ శాసనసభ ఉపఎన్నికలో జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ సంచలన విజయం సాధించారు. గత 30 ఏళ్లుగా బిజెపికి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో పీకే గెలుపు జెండా ఎగరేశారు. ప్రశాంత్ కిశోర్ తన సమీప బీజేపీ అభ్యర్థి నీరజ్ సిన్హాపై 18,953 ఓట్ల భారీ తేడాతో ఘన విజయం సాధించారు. ఉదయం కౌంటింగ్ మొదలైనప్పటి నుంచీ బీజేపీ నేత నీరజ్ కుమార్ కంటే ముందంజలో ఉన్న ప్రశాంత్ కిశోర్ ఒక్కో రౌండ్ ముగిసేసరికి తన ఆధిక్యాన్ని అంతకంతకూ పెంచుకున్నారు. పీకేకు 63,203 పోలయ్యాయి. అలానే రెండో స్థానంలో నిలిచిన బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ కు 44,250, మూడో స్థానంలో నిలిచిన ఆర్జేడీ అభ్యర్థి రేఖ కుమారి 14,085 ఓట్లు సాధించారు. ఈ చరిత్రాత్మక విజయం అనంతరం ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ.. తన గెలుపు బీజేపీ హైకమాండ్‌కు ఒక బలమైన సందేశమని వ్యాఖ్యానించారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తిని బిహార్ ముఖ్యమంత్రిగా చేశారని తీవ్రస్థాయిలో మండిపడిన ఆయన, సామ్రాట్ చౌదరిని వెంటనే సీఎం పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ఉపఎన్నిక ఫలితం బిహార్ రాజకీయాల్లో సరికొత్త మార్పునకు సంకేతమని ఆయన పేర్కొన్నారు. రాజ్యసభకు ఎన్నికైన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్.. బంకీపూర్ ఎమ్మెల్యేగా రాజీనామా చేశారు. దీంతో ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహించారు. బీజేపీ కంచుకోటగా పేరున్న ఈ నియోజకవర్గంలో.. 1995 నుంచి బీజేపీ అభ్యర్థులే విజయం సాధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రశాంత్ కిశోర్ అసాధారణ విజయం సాధించడం, బీజేపీ కంచుకోటలో జేఎస్‌పీ జెండా ఎగురవేయడం యావత్ దేశం దృష్టిని ఆకర్షించింది. ప్రశాంత్ విజయంతో.. జేఎస్పీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నాయి.

## అధికార బిజెపికి వరుస దెబ్బలు

### మధ్యప్రదేశ్, బీహార్ ఉప ఎన్నికల్లో అభ్యర్థుల ఓటమి

### గుజరాత్‌లో మాత్రం గెలుపు

న్యూఢిల్లీ,

భారతీయ జనతా పార్టీకి వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. పేపర్ లీకేజీల వివాదంపై నిరసనల నడుమ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన పరిణామం మరవకముందే..బీజేపీ పాలిత రాష్ట్రాలైన బిహార్, మధ్యప్రదేశ్ ఉపఎన్నికల్లో ఆ పార్టీ పరాజయం పాలైంది. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీలకే ఉపఎన్నికల్లో మొగ్గు ఉండే ఆనవాయితీకి భిన్నంగా బిహార్‌లోని బంకీపూర్, మధ్యప్రదేశ్‌లోని దతియా స్థానాల్లో బీజేపీ ఓటమి పాలవడం కమలదళాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అయితే గుడ్డిలో మెల్లలా గుజరాత్ మంజల్‌పూర్ స్థానాన్ని గెలుచుకుని పరువు దక్కించుకుంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ రాజీనామాతో ఖాళీ అయిన బంకీపూర్ స్థానం బీజేపీకి దశాబ్దాలుగా బలమైన కోట. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి 50,000 పైచిలుకు మెజారిటీ సాధించిన బీజేపీకి ఈసారి గట్టి షాక్ తగిలింది. రాజకీయ వ్యూహకర్త నుంచి రాజకీయ నాయకుడిగా మారిన ప్రశాంత్ కిశోర్ (జన్ సురాజ్ పార్టీ) బంకీపూర్ స్థానంలో విజయం సాధించి, బిహార్ శాసనసభలో తొలిసారి ఖాతా తెరిచారు. బీజేపీ ఓటు బ్యాంక్ ఏకంగా మూడోవంతుకు పడిపోయింది. నీట్ పేపర్ లీక్ ఆందోళనలు, యూజీసీ గైడ్‌లైన్స్, స్థానిక విద్యార్థుల నిరసనలు, పోలీసుల చర్యల వల్ల యువత, బీజేపీ సాంప్రదాయ ఓటర్లు దూరమవ్వడమే కాక, పోలింగ్ శాతం గణనీయంగా తగ్గడం ఓటమికి ప్రధాన కారణమైంది. గతంలో 46,000 ఓట్లు సాధించిన ఆర్‌జేడీ అభ్యర్థి రేఖా గుప్తా కూడా ఈసారి 15,000 ఓట్లకు పరిమితమయ్యారు. బీజేపీ అగ్రవర్ణ ఓట్లను చీల్చేందుకు ఆర్‌జేడీ సైలెంట్‌గా తన ఓటు బ్యాంకును ప్రశాంత్ కిశోర్‌కు బదిలీ చేసిందనే ఆరోపణలను బీజేపీ గుప్పిస్తోంది.

## చిట్టీల వ్యాపారి టోకరా

### 3కోట్లు ముంచేసిన దంపతులు పరారీ

సంగారెడ్డి

అమీన్‌పూర్ మండలం బీరంగూడ డివిజన్‌లోని రాఘవేంద్ర కాలనీలో చిట్టీల పేరుతో భారీ మోసం జరిగింది. స్థానికంగా సాయి గణెళిష్ టెక్స్‌టైల్స్ పేరుతో బట్టల దుకాణం నిర్వహిస్తున్న శిరీష.. తన భర్త సాంబశివరావుతో కలిసి కొన్నేళ్లుగా చిట్టీల వ్యాపారం నిర్వహిస్తోంది. అధిక లాభాలు వస్తాయని ఆశ చూపిస్తూ కాలనీలోని పలువురు మహిళలను ఆకర్షించి, వారి నుంచి విడతల వారీగా భారీ మొత్తంలో నగదు సేకరించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో దాదాపు రూ. 3 కోట్ల వరకు వసూలు చేసినట్లు సమాచారం. చిట్టీల గడువు సమీపిస్తుండటంతో డబ్బులు తిరిగి ఇవ్వాల్సిన సమయంలో శిరీష, సాంబశివరావు దంపతులు తమ సొంత ఇంటిని విక్రయించి రాత్రికి రాత్రే పరారైనట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో మోసపోయిన మహిళలు తీవ్ర ఆందోళనకు గురై అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దంపతుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాధితుల నుంచి పూర్తి వివరాలు సేకరించి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ఎపిలో పలు జిల్లాలకు భారీ వర్ష హెచ్చరిక

అమరావతి,

ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పిడుగుపాటుతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే విజయనగరం, విశాఖపట్నం, అల్లూరిసీతారామరాజు, అనకాపల్లి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఆరెంజ్ అలర్ట్ జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వానలు పడతాయని వెల్లడించారు. అరకు, చింతపల్లె, నర్సీపట్నంలో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపారు. యలమంచిలి, అనకాపల్లి, విశాఖపట్నం పరిసరాల్లో పిడుగులు పడే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. శ్రీకాకుళం, మన్యం, కాకినాడకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. అలాగే, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ హెచ్చరికలు చేశారు. ఏలూరు, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడే సూచనలు ఉన్నాయని వెల్లడించారు. ఎల్లో అలర్ట్ జిల్లాల్లో చెదురుమదురుగా పిడుగులతో కూడిన వానలు కురుస్తాయని తెలిపారు. ఉరుములు, పిడుగులు పడే సమయంలో ప్రజలు చెట్ల కింద నిలబడవద్దని సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## బాలుడి ఆరోగ్యానికి మంత్రి వాసంశెట్టి భరోసా

అమరావతి,

:ఫ్యాన్‌కోనీ అనీమియాతో బాధపడుతున్న బాలుడికి అండగా ఏపీ మంత్రి వాసంశెట్టి సుభాశ్ అండగా నిలిచారు. రూ. 20 లక్షల బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ఏర్పాట్లు పూర్తి చేశారు. హైదరాబాద్ బసవతారకం ఆస్పత్రిలో చరణ్ తేజ పవన్‌కు శస్త్రచికిత్స నిర్వహించనున్నారు. బోన్ మ్యారో దాత నుంచి సేకరణ పక్రియ విజయవంతమైంది. పేద కుటుంబానికి సహాయం అందించేందుకు మంత్రి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. దాతలు, సేవా సంస్థల సహకారంతో చికిత్సకు నిధులను మంత్రి సుభాశ్ సమీకరించారు. సహారా హెల్త్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ నుంచి రూ. 2 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఈ చికిత్సలో భాగమైన వైద్యులు, ఆస్పత్రి యాజమాన్యానికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. చరణ్ తేజ పవన్ పూర్తిగా కోలుకోవాలని భగవంతుడిని మంత్రి సుభాశ్ ప్రార్థించారు.

## నిమ్స్‌లో వెయ్యి రోబోటిక్ సర్జరీలు

### డాక్టర్లు, సిబ్బందిని అభినందించిన మంత్రి దామోదర

హైదరాబాద్,

నిమ్స్ హాస్పిటల్ మరో ఘనతను సాధించింది. రెండున్నర సంవత్సరాల వ్యవధిలోనే నిమ్స్ హాస్పిటల్‌లో 1,000 రొబోటిక్ సర్జరీలను విజయవంతంగా పూర్తి చేసినట్లు నిమ్స్ డైరెక్టర్, డాక్టర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. సోమవారం సచివాలయంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహని కలిసిన డాక్టర్ రాహుల్ దేవరాజ్, నిమ్స్ సాధించిన ఈ ఘనతను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్‌తో పాటు రొబోటిక్ సర్జరీల్లో భాగస్వాములైన డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, ఇతర సిబ్బందిని మంత్రి అభినందించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో నిమ్స్ కీలక పాత్ర పోషిస్తోందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఇటీవలే నిమ్స్‌లో 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తవడం, ఇప్పుడు 1,000 రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవడం ప్రభుత్వ వైద్యరంగ సామర్థ్యానికి నిదర్శనమని మంత్రి అన్నారు. దక్షిణ భారతదేశంలో ప్రభుత్వ రంగంలో తొలి రొబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌ను విజయవంతంగా నిర్వహించిన నిమ్స్, దేశంలోనే ప్రముఖ అవయవ మార్పిడి కేంద్రాల్లో ఒకటిగా నిలిచిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక వైద్య సేవలను మరింత విస్తరిస్తోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం నిమ్స్‌తో పాటు ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్‌లో కూడా రొబోటిక్ సర్జరీలు విజయవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. నిర్మాణంలో ఉన్న కొత్త టిమ్స్ హాస్పిటళ్లతో పాటు గాంధీ, కొత్త ఉస్మానియా హాస్పిటల్‌లోనూ అత్యాధునిక రొబోటిక్ ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేసి, ప్రపంచ స్థాయి వైద్య సేవలను ప్రభుత్వ రంగంలోనే అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వెల్లడించారు. డాక్టర్ రాహుల్ దేవరాజ్ మాట్లాడుతూ.. నిమ్స్‌లో ఇప్పటివరకు నిర్వహించిన వెయ్యి రొబోటిక్ సర్జరీల్లో యూరాలజీ విభాగంలో 590, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలో 248, సర్జికల్ ఆంకాలజీ విభాగంలో 162 శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ శస్త్రచికిత్సల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) వంటి ప్రభుత్వ పథకాల ద్వారా రోగులకు పూర్తిగా ఉచితంగా నిర్వహించడం విశేషమని తెలిపారు. దీంతో ఖరీదైన రొబోటిక్ సర్జరీలను కూడా సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురాగలిగామని చెప్పారు. విజయానికి యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, అనస్థీషియా విభాగాలు, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందం, ఇతర సహాయక విభాగాల సమిష్టి కృషి కారణమని డాక్టర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. రాష్ట్రంలో ఆధునిక వైద్య సేవల బలోపేతానికి నిరంతరం సహకరిస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఈ సందర్భంగా డాక్టర్ రాహుల్ దేవరాజ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అత్యాధునిక, నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు సాధించే దిశగా ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు



## మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల కేసు

### బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట

### ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించిన ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ,

మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ మాజీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట దక్కింది. ఈ కేసులో ఆయనను నిర్దోషిగా ప్రకటిస్తూ రౌజ్ అవెన్యూ కోర్టు అదనపు ప్రధాన న్యాయమూర్తి అశ్విని పన్వార్ సోమవారం తీర్పు వెలువరించారు. ఈ కేసులో మరో నిందితుడైన డబ్ల్యూఎఫ్ఐ మాజీ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌ను కూడా కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడం, బాధితులు ఇచ్చిన వాంగ్మూలాల్లో వ్యత్యాసం కారణంగా కోర్టు ఈ కేసును కొట్టేసింది. ఆరుగురు మహిళా రెజ్లర్లు చేసిన ఫిర్యాదుల ఆధారంగా బ్రిజ్‌భూషణ్‌పై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం 2023 జూన్ 15న మహిళల గౌరవానికి భంగం కలిగించడం, లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడినట్లు పలు సెక్షన్ల కింద ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. 2024 మే 10న ట్రయల్ కోర్టు ఐదుగురు మహిళా రెజ్లర్లకు సంబంధించిన ఆరోపణలపై బ్రిజ్‌భూషణ్‌పై అభియోగాలు నమోదు చేసింది. ఇద్దరు రెజ్లర్లను బెదిరించిన ఆరోపణలపైనా విచారణ కొనసాగింది. అలాగే ఒక మైనర్ రెజ్లర్ కూడా ఆరోపణలు చేసినప్పటికీ, అనంతరం ఆమె ఫిర్యాదును ఉపసంహరించుకోవడంతో పోక్సో చట్టం కింద నమోదైన కేసును పోలీసులు రద్దు చేశారు. తాజా తీర్పుతో బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్, వినోద్ తోమర్ ఇద్దరూ ఈ కేసులో నిర్దోషులుగా విడుదలయ్యారు. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడం, బాధితులు ఇచ్చిన వాంగ్మూలాల్లో వ్యత్యాసం కారణంగా కోర్టు ఈ కేసును కొట్టివేసింది. 2016–2019 మధ్యకాలంలో తాము లైంగిక వేధింపులు ఎదుర్కొన్నామంటూ 2023లో మహిళా రెజర్లు దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనలు చేపట్టడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనమైంది. నాటి సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ , ఇతర సభ్యులపై వారు ఈ ఆరోపణలు చేశారు. ఈ నిరసనల్లో స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, సాక్షి మాలిక్, బజరంగ్ పునియా తదితరులు పాల్గొన్నారు. కేంద్రం జోక్యంతో వారు మధ్యలో నిరసనలు విరమించారు. అయితే తగిన చర్యలు తీసుకోవట్లేదని ఆరోపిస్తూ ఆరుగురు రెజ్లర్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. మరోసారి నిరసనలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా పార్లమెంట్ కొత్త భవనంవైపు మార్చ్ చేపట్టగా.. వారిని పోలీసులు అడ్డుకోవడం, వారిని ఈడ్చుకెళ్లిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ కూడా తీవ్రంగా స్పందించింది. ఆరుగురు మహిళా రెజ్లర్లు చేసిన ఫిర్యాదు ఆధారంగా బ్రిజ్‌భూషణ్‌పై కేసు నమోదైంది. పోలీసులు అభియోగాలు దాఖలు చేశారు. ఆ ఆరుగురిలో వినేశ్ ఫొగాట్ కూడా ఉన్నారు. ఆ విషయాన్ని మూడు నెలల క్రితం ఆమె వెల్లడించారు. లైంగిక వేధింపుల బాధితుల గుర్తింపును పరిరక్షించేలా సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఇంతకాలం తన గుర్తింపును బయటపెట్టలేదని వెల్లడించారు. అంతకుముందు మైనర్ రెజ్లర్ ఒకరు తాను చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోవడంతో పోక్సో కేసులో సింగ్ ఇప్పటికే నిర్దోషిగా తేలారు. ఇక నేటి తీర్పుతో ఆయనపై క్రిమినల్ విచారణ ముగిసినట్లయింది. తొలినుంచి బ్రిజ్ భూషణ్ తనపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చారు. ఆ ఆరోపణలు నిజమని తేలితే.. నేను ఉరివేసుకుంటానని తొలిరోజే చెప్పాను. నేడు నేను నిర్దోషిగా తేలినందుకు ఎంతోసంతోషంగా ఉందని తీర్పు అనంతరం సింగ్ వ్యాఖ్యానించారు.

PRGI NO: TGTEL/25/A5314

అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్

# సంపాదకీయం...

## జంతర్ మంతర్ సామాజిక పాఠాలు

పద్దెనిమిదవ శతాబ్దంలో సైన్స్ పాఠాలు చెప్పిన జంతర్ మంతర్ ఇపుడు సామాజిక పాఠాలు చెప్తున్నది. అధికారపక్షానికి, ప్రతిపక్షాలకు రాజకీయ పాఠాలు కూడా. జంతర్ మంతర్ ఆందోళన ప్రస్తుత దశ ముగియవచ్చు. అయినా పాఠాలు కొనసాగుతున్నాయి. ఇది పరిశీలకులకు తోస్తున్న మాట మాత్రమే కాదు. కాక్రోచ్ జనతా పార్టీ పేరిట సరికొత్త చైతన్యాలు చూపిన యువతరం, తమ ఉద్యమం ఇంతటితో ముగియలేదని, భవిష్యత్తులోకి చాలా దూరం ప్రయాణించవలసి ఉన్నదని, ప్రయాణించగలమని, ప్రస్తుతానికి ఇది ఒక మజిలీ మాత్రమేనని స్వయంగా పదే పదే ప్రకటిస్తున్నారు. ూశ్రీంశీ =ఖుఁ – ప్రజారోగ్య చట్టానికి పదును పెట్టాలిూఁజవతీఅంవఎవత్ ప్రధానంగా విద్యారంగ సమస్యలతో ఆరంభించిన కాక్రోచ్ యువతరం, అందుకు మాత్రమే పరిమితం కాకుండా అనేక ఇతర సామాజిక అంశాలను కూడా ప్రస్తావిస్తుండటం గమనార్హమైన విషయం. ఇటువంటి ధోరణి కొంతవరకు వామపక్ష విద్యార్థి సంఘాలలో ఉండటం తెలిసిందే కాగా, అటువంటి మొగ్గ ఏమీ ప్రకటిత రూపంలో లేని ఒక సరికొత్త వేదిక నాయకత్వాన కనిపించటం ఒకటైతే, అసలు మొత్తం విద్యార్థి లోకానికి, యువజన లోకానికి వ్యాపించి కనిపించటం గమనించదగ విశేషం. వారు ఒకవైపు విద్యా వ్యవస్థను, మరొక వైపు రాజకీయ వ్యవస్థను కూడా ప్రశ్నించటం గమనించదగ్గది. ూశ్రీంశీ =ఖుఁ –

పరిణతి చూపితేనే పాలకులకు గౌరవం కాక్రోచ్ తక్షణ ఆందోళనకు ప్రేరణ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేసిన అవమానకర వ్యాఖ్యలన్నది తెలిసిందే. అదే కాక్రోచ్‌ను తమ పేరుగా తీసుకున్న యువకులు వెంటనే లేవనెత్తిన ప్రశ్నలను చూడండి. బొద్దింకలు మురికినుంచి పుట్టుకు వచ్చే అనారోగ్యకరమైన కీటకాలన్నది నిజమేగాని, మన వ్యవస్థ మురికిగా తయారు కావటం వల్లనే ఇది జరుగుతున్నది. మరి ఈ మురికి వ్యవస్థకు బాధ్యత ఎవరికి? బొద్దింకలదా లేక ఆ మురికి వ్యవస్థను సృష్టించిన వారిదా? తన వ్యాఖ్యలు పట్ల నిరసన రావటంతో ప్రధాన న్యాయమూర్తి వివరణ ఇవ్వ బూనారుగాని అది చెల్లుబాటు కాలేదు. ఎందుకంటే తను నకిలీ లా డిగ్రీల వారిని ఉద్దేశించి ఆ వ్యాఖ్య చేసిన మాట నిజమే అయినా, ఈ దేశపు యువతరం ఎటువంటి వ్యవస్థలో, ఎటువంటి జీవిత పరిస్థితుల కారణంగా, ఇటువంటి మార్గాలను అనుసరించవలసిన విధిలేని స్థితి ఏర్పడుతున్నది? ఈ మార్గాన్ని అనుసరించ వలసి రావటం సరైనదని కాదు. అందువల్ల తాత్కాలికంగా వారికి, వ్యవస్థకు కొంత హాని కలుగుతుందన్నది నిర్వివాదాంశం. అదే సమయంలో కార్యకారణ సంబంధం అనే దానిని విస్మరించి, ఈ మురికి వ్యవస్థకు బలి అవుతున్న వారిన్ని తమ మార్గమే సరైనది కాదని కోర్టులు నిందించటం సరైనదవుతుందా? అందువల్ల సమస్య పరిష్కారమవుతుందా? సమస్యను పరిష్కరించవలసింది కోర్టులని యువతరం ఏమీ అనటం లేదు. కాని కోర్టు వ్యాఖ్యను ఆధారంగా తీసుకుని వ్యవస్థను ప్రశ్నిస్తున్నారు. పార్టీలను, ప్రభుత్వాలను సవాలు చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వాన్నే కాదు. అన్ని పార్టీలనూ. ఎందుకంటే పరీక్షలు, విద్య ఈ విధంగా ఉండటానికి అందరూ బాధ్యులే. అందరూ ఏవో ఒక దశలో కేంద్రంలోనో, రాష్ట్రాలలోనో పరిపాలించిన వారే, పరిపాలిస్తున్నవారే. ఇదే ఆందోళన సందర్భంగా యువతరం, అసలు మన దేశంలో విద్యారంగం మొదటి నుంచి ఎట్లా ఉంది? మన కళ్లముందే అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలలో ఏవిధంగా అమలవుతున్నది? ఇక్కడ మెరుగైన విద్య ఖరీదుగా మారి కొన్ని వర్గాలకు అందుబాటులో ఉండగా, తక్కిన విస్తృతమైన వర్గాలు ఇన్ని దశాబ్దాలు గడిచినా ఎందుకు వెనుకబడి ఉన్నాయి?

# విద్యారంగ సమస్యలపై దశలవారి పోరాటం

### 7న నల్ల బ్యాడ్జీలతో భోజన విరామ సమయంలో నిరసనలు

### 12, 13 తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు

### ఉపాధ్యాయ సంఘాల జెఎసి వెల్లడి

**హైదరాబాద్,**

ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటం నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నిర్ణయించింది. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో యూఎస్‌పీసీ మంగళవారం మీడియా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ నాయకులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలన్నీ విద్యారంగ సమస్యలేనని, వాటి పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారుల వైఖరి వల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు క్రమంగా మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డిమాండ్ల పరిష్కారానికి దశలవారీ పోరాటాలు నిర్వహించాలని యూఎస్‌పీసీ నిర్ణయించింది. ఆగస్టు 7న నల్ల బ్యాడ్జీలతో పాఠశాలల్లో భోజన విరామ సమయంలో నిరసనలు, పీఆర్‌సీ ప్రకటించేదాకా ప్రతిరోజూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని యూఎస్‌పీసీ పిలుపునిచ్చింది. ఆగస్టు 12, 13 తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, తహసీల్దార్లకు మెమోరాండం, 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, 29న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించారు.

అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వేలాది మంది ఉపాధ్యాయులతో చలో అసెంబ్లీ నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. అన్ని సంఘాలు ఐక్య పోరాటాలకు కలిసి రావాలని, ఉపాధ్యాయులు అందరూ సంఘాలకు అతీతంగా సమస్యల పరిష్కారం కోసం ఈ పోరాటంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యా రంగానికి 15శాతం నిధుల కేటాయింపు హామీని విస్మరించారని, నాణ్యమైన విద్య పేరుతో పాఠశాలల కుదింపునకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభిస్తున్నామని ఘనంగా ప్రకటించినప్పటికీ కేవలం యూకేజీ కే పరిమితం చేశారని, ప్రీ ప్రైమరీ తరగతులను మధ్యాహ్నం 12 గంటల వరకే నడపాలి. కానీ ప్రైవేటు పాఠశాలల్లో సాయంత్రం 4 వరకు ప్రీప్రైమరీ తరగతులు నడుస్తున్నాయని, ప్రభుత్వ పాఠశాలలకు పంపితే మధ్యాహ్నం 12 తర్వాత తమ పిల్లలను ఎవరు చూసుకుంటారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారని వారు వాపోయారు. ప్రాథమిక విద్యకు అవరోధంగా ఉన్న జీవో 25ను సవరించాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు టీచర్లు, 50 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో తరగతికి ఒక టీచర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. నూతన జిల్లాలకు డీఈవో, రెవెన్యూ డివిజన్ కు ఒక డిప్యూటీ ఈవో, అన్ని మండలాలకు ఎంఈవో పోస్టులు మంజూరు చేయాలని, పీవో 2018 కి అనుగుణంగా సర్వీసు నిబంధనలు రూపొందించి పర్యవేక్షణ అధికారుల పోస్టులు భర్తీ చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు 15 లోగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని, టెట్ లో సర్వీసు వెయిటేజీ ఇవ్వాలని, స్పెషల్ టెట్ ను సబ్జెక్టు వారీ పేపర్లతో నిర్వహించాలని, సీపీఎస్ రద్దు చేయాలని, మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ వర్తింపజేయాలని, విద్యా శాఖ లో బీసీ, గిరిజన గురుకులాల టైంటేబుల్ మార్చాలని, మోడల్, ఎయిడెడ్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేయాలని కోరారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని, జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని, జీవో 190 అమలు చేయాలని, 5 వాయిదాల కరువు భత్యం (ఆం), పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులను ప్రతినెలా రూ. 2000 కోట్ల చొప్పున విడుదల చేయాలని, హెల్త్ కార్డులు పూర్తి స్థాయిలో అమలుకు చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చావ రవి, ఏ వెంకట్(టీఎస్ యూటీఎఫ్), సీహెచ్ అనీల్ కుమార్, ఎన్ తిరుపతి(టీపీటీఎఫ్), ఎం సోమయ్య, టీ లింగారెడ్డి(డీటీఎఫ్), కొమ్ము రమేష్ (బీటీఎఫ్), మేడి చరణ్ దాస్ (ఎస్సీ, ఎస్టీ టీఎఫ్), ఎస్ హరికిషన్ (టీటీఏ), బీ కొండయ్య (ఎంఎస్‌టీఎఫ్), వై విజయ కుమార్, రవీందర్ (ఎస్సీ, ఎస్టీ యూఎస్) పాల్గొన్నారు.



shutterstock.com · 2473734311

అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

# ఆట



## విండీస్ టీమ్‌లో భగ్గుమన్న విభేదాలు!

వెస్టిండీస్ హెడ్ కోచ్ డారెన్ సామీపై ఆ జట్టు ఫాస్ట్ బౌలర్ అల్జారీ జోసెఫ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. తానేం డారెన్ సామీ తొత్తును కాదని, వెస్టిండీస్ ఆటగాడినని స్పష్టం చేశాడు. వ్యక్తిగత కక్షతో తన గురించి అవాస్తవాలు మాట్లాడటం డారెన్ సామీకి తగదని హితవు పలికాడు. తన గురించి అన్నీ తెలిసి కూడా ఎందుకు అసత్యాలు మాట్లాడాడో అర్థం కావడం లేదన్నాడు.డబ్ల్యూటీసీ 2027 ఎడిషన్‌లో భాగంగా సొంతగడ్డపై పాకిస్థాన్‌తో వెస్టిండీస్ రెండు టెస్ట్‌ల సిరీస్ ఆడుతోంది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్‌ను వెస్టిండీస్ గెలిచి 1-0తో ఆధిక్యంలో నిలిచింది. అయితే ఈ సిరీస్‌కు అల్జారీ జోసెఫ్ దూరమయ్యాడు. వ్యక్తిగత కారణాలతోనే అల్జారీ జోసెఫ్ ఈ సిరీస్ ఆడటం లేదని వెస్టిండీ క్రికెట్ బోర్డు ప్రకటించింది. కానీహెడ్ కోచ్ డారెన్ సామీ మాత్రం భిన్నమైన కారణాన్ని చెప్పాడు. అల్జారీ జోసెఫ్ ఉద్దేశపూర్వకంగానే జట్టు సెలెక్షన్‌కు దూరంగా ఉన్నాడని, పాకిస్థాన్‌తో ఆడటానికి అతను నిరాకరించాడని తెలిపాడు. ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. పాకిస్థాన్ మీడియాతో పాటు అభిమానులు అల్జారీ జోసెఫ్‌పై విమర్శలు గుప్పించారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పందించిన అల్జారీ జోసెఫ్ ఘాటు వ్యాఖ్యలు చేశాడు. 'ఈ సిరీస్‌కు ముందు నేను మా హెడ్ కోచ్‌తో మాట్లాడాను. విండీస్ బోర్డుతో కూడా చర్చించాను. ఆ సమయంలోనే బోర్డు నేను వ్యక్తిగత కారణాల వల్ల దూరమయ్యానని ప్రకటించింది. అన్ని విషయాలు తెలిసి కూడా సామీ అలా ఎందుకు చెప్పాడో నాకు అర్థం కావడం లేదు. అతని వ్యాఖ్యలు ఎక్కడికి దారితీస్తాయో నాకు తెలుసు. నా గురించి తెలిసి కూడా ఇలా మాట్లాడటం ఎందుకు? నిజానికి ఈ ఏడాది నేను ఆటకు దూరంగా ఉన్నా. కండరాల నొప్పి కారణంగా నా శరీరం సహకరించడం లేదు. టెస్ట్ ఫార్మాట్ ఆడేందుకు నేను ఏ మాత్రం సిద్ధంగా లేను. ఇవన్నీ తెలిసి కూడా సామీ నాకు వ్యతిరేకంగా మాట్లాడాడు. ఇలా సమయం, సందర్భం లేకుండా ఎలా మాట్లాడుతారు? నేను ప్రొఫెషనల్‌క్రికెట్‌ను. నా పనిని నేను చేసుకుంటా. నేను వెస్టిండీస్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నా.నేనేం డారెన్ సామీ తొత్తును కాదు. కాబట్టి ఈ వ్యాఖ్యలతో నాకు ఒరిగేదేం లేదు. అయినా నేనేం జట్టు సభ్యులను స్నేహితులుగా మార్చుకునేందుకు ఆడటం లేదు. వెస్టిండీస్ ప్రజలకు ప్రాతినిథ్యం వహిస్తున్నా. ఎవర్నీ పట్టించుకోకుండా నా బాధ్యతనే నేను నిర్వర్తిస్తాను.'అని అల్జారీ జోసెఫ్ పేర్కొన్నాడు. ఈ ఇద్దరి వ్యాఖ్యలు వెస్టిండీస్ క్రికెట్‌లోని విభేదాలను బయటపెట్టాయి. వెస్టిండీస్, పాకిస్థాన్ మధ్య రెండో టెస్ట్ ఆదివారం నుంచి ప్రారంభం కానుంది.

## నా అటిట్యూడ్ వల్లే జట్టులో చోటు కోల్పోయా

### ఎప్పుడూ కెప్టెన్సీ కోసం ఆడలేదు..

### ఓ ఇంటర్వ్యూలో హార్దిక్ పాండ్యా ఆసక్తికర వ్యాఖ్యలు

కెరీర్ ప్రారంభంలో తన ఆట కంటే అటిట్యూడ్ నచ్చకనే జట్టు నుంచి తప్పించేవారని హార్దిక్ పాండ్యా తెలిపాడు. అప్పుడు తనకు ఈ విషయం తెలిసేది కాదని చెప్పుకొచ్చాడు. గాయంతో భారత జట్టుకు దూరమైన హార్దిక్ పాండ్యా.. బెంగళూరులోని బీసీసీఐ సెంట్రల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో రిహాబిలిటేషన్ తీసుకుంటున్నాడు. టీమిండియా తదుపరి వైట్ బాల్ సిరీస్‌లు ఆడేందుకు సిద్ధమవుతున్నాడు.తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న హార్దిక్ పాండ్యా తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తాను ఎప్పుడూ కెప్టెన్సీ కోసం ఆడలేదని, జట్టు కోసమే ఆడానని తెలిపాడు. 'సారథ్యం విషయానికి వస్తే.. నాకు నేను ఎప్పుడూ సందేహించలేదు. ఎందుకంటే నేను ఎప్పుడు పదవులు కోసమో లేక నా మాట నెగ్గించుకోవడానికో ఆడను. నేను కెప్టెన్ కాకపోయినా జట్టులో నాయకుడిలాంటి వాడినని భావిస్తాను.

జట్టులో నాది ఒక ప్రత్యేకమైన, ప్రభావవంతమైన పాత్ర అని నాకు తెలుసు. నేను చెప్పే మాటలను జట్టులో 11 మంది ఆటగాళ్లు వింటారు.నాయకుడిగా ఉండటానికి కెప్టెనే కానవసరం లేదనేది నా నమ్మకం. ఒక ఆటగాడిగా కూడా నాయకుడిగా ఉండవచ్చు. నేను చాలా అదృష్టవంతుడిని, కృతజ్ఞుడిని అని భావిస్తున్నా. నేను కెప్టెన్సీ కోసం ఎప్పుడూ ఆడలేదు. ప్రతి క్రికెటర్ కల దేశానికి ప్రాతినిథ్యం వహించడమే. కానీ కెప్టెన్సీ అనేది ఒక అదనపు గౌరవం. అయితే ఆ సంతోషం నాకు కొద్ది నిమిషాలు మాత్రమే నిలిచింది. ఆ తర్వాత జట్టును ఎలా మెరుగుపర్చగలననే ఆలోచించాను. ఆ సమయాన్ని నేను ఆస్వాదించాను. అయితే వాటిని నేను మనసుకు తీసుకోను. ఎందుకంటే అవి ఏ క్షణంలోనైనా మనల్ని విడిచివెళ్లిపోవచ్చు. ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పడం నాకు ముఖ్యం కాదు. ఎందుకంటే అది నాకు అనవసరం. నా పనితో నేను సంతోషంగా ఉన్నానా లేదా? అన్నదే నాకు ముఖ్యం. నేను క్రికెట్ నుంచి బ్రేక్ తీసుకోవడానికి ప్రధాన కారణం నా మనసును ఉత్తేజపరుచుకొని, ఆ పాత ఉత్సాహాన్ని తిరిగి పొందడమే. కేవలం ఆటను ఆస్వాదించడానికే ప్రయత్నిస్తాను.నేను కష్టపడేది కేవలం నా కోసమే. నా సంతోషం, మనశ్శాంతి కోసమే, ఇతరుల కోసం కాదు. అంతా సవ్యంగా సాగినప్పుడు నేను విమర్శకులపై ప్రతీకారం తీర్చుకున్నానని అందరూ అనవచ్చు. కానీ అది నా ఉద్దేశం ఏ మాత్రం కాదు. నాకు నేను సంతృప్తి చెందడమే నా ఏకైక లక్ష్యం. నేను వచ్చిన నేపథ్యం. నా ప్రయాణం ఆధారంగా నేను ప్రత్యేకంగా నిలబడాల్సి వచ్చింది. నా వ్యక్తిత్వం మొదటి నుంచి పూర్తిగా భిన్నంగా ఉండేది. అందుకే నేను ఎదిగే క్రమంలో చాలా సమస్యలను ఎదుర్కొన్నాను.నాకు రంగురంగుల వస్తువులు అంటే ఇష్టం.నేను ఎప్పుడూ చురుకుగా.. హాస్య భరితంగా ఉండేవాడిని. నేను సాధారణ సాంప్రదాయ క్రికెటర్లలా కాకుండా.. కాస్త భిన్నమైన వ్యక్తిని. ఇప్పుడు అది నాకు అనుకూలంగా ఉండొచ్చు. కానీ తొలినాళ్లలో నన్ను చాలా జట్టు నుంచి తొలగించారు. పరుగులు చేయనందవల్ల కాదు.. నా అటిట్యూడ్ నచ్చకనే జట్టు నుంచి తప్పించేవారు. అప్పుడు అటిట్యూడ్ అంటే ఏంటో కూడా నాకు తెలియదు. దాని గురించి నాకేమీ అవగాహన కూడా లేదు.'అని హార్దిక్ పాండ్యా చెప్పుకొచ్చాడు.




Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthaminagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.

# హైదరాబాద్‌లో కల్తీ మసాలాల గుట్టురట్టు..

**13 సంస్థలపై దాడులు, 25.3 టన్నుల విషపూరిత ఉత్పత్తుల స్వాధీనం**

హైదరాబాద్‌లో కల్తీ మసాలా దినుసుల తయారీపై పోలీసులు, హెచ్-ఫాస్ట్ బృందం సంయుక్తంగా నిర్వహించిన విస్తృత తనిఖీల్లో సంచలన విషయాలు వెలుగుచూశాయి. నగరంలోని 13 మసాలా తయారీ, వ్యాపార సంస్థలపై దాడులు నిర్వహించిన అధికారులు సుమారు 25.3 టన్నుల కల్తీ మసాలా దినుసులను స్వాధీనం చేసుకుని నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఈ దాడుల వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడించారు. తనిఖీల్లో నాణ్యతలేని, తిరస్కరించబడిన ముడి పదార్థాలతో పాటు సింథటిక్ రంగులు, బట్టలకు ఉపయోగించే డైలు, టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ కలర్స్, రైస్ బ్రాన్ ఆయిల్ వంటి పదార్థాలను ఉపయోగించి కల్తీ మసాలా దినుసులు తయారు



చేస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వాము, జీలకర్ర, షాజీరా, లవంగాలు వంటి మసాలా దినుసులతో పాటు అల్లం-వెల్లుల్లి పేస్టులో టైటానియం ఆక్సైడ్ వంటి ప్రమాదకర రసాయనాలను కలుపుతున్నట్లు దర్యాప్తులో బయటపడిందన్నారు. ఈ కల్తీ తయారీ పద్ధతులను నిందితులు ఇండోర్ తదితర ప్రాంతాల్లో నేర్చుకున్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. కల్తీలో ఉపయోగిస్తున్న కొన్ని రసాయనాలు అత్యంత ప్రమాదకరమైనవని, వాటిని నీటితో కడిగినా తొలగించలేమని సజ్జనార్ హెచ్చరించారు. సాధారణ ప్రజలు వాటిని సులభంగా గుర్తించలేరని పేర్కొన్నారు. ఇలాంటి విషపూరిత పదార్థాలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల కాలేయం, మూత్రపిండాలు దెబ్బతినడంతో పాటు అల్సర్, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ఆయన వివరించారు. ఆహార భద్రతకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ప్రజలు నాణ్యమైన, విశ్వసనీయ సంస్థల ఉత్పత్తులనే కొనుగోలు చేయాలని హైదరాబాద్ పోలీసులు సూచించారు.

**కల్తీదారులను ఉపేక్షించేది లేదు**

ఆయా ప్రాంతాల నుంచి పోలీసులు 25.3 టన్నుల కల్తీ మసాలా దినుసులు, 89.15 టన్నుల ముడి పదార్థాలను స్వాధీనం చేసు కున్నట్టు సజ్జనార్ తెలిపారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ దారులను ఉపేక్షించేది లేదని సీపీ హెచ్చరిం చారు. ఇలాంటి కేసుల్లో నిందితులపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 110 కింద హత్యాయత్నం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

# శిశువు ఆరోగ్యానికి తల్లిపాలే తొలి రక్షణ: అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్ మయి



ప్రపంచ తల్లిపాల వారోత్సవం (ఆగస్టు 1 నుంచి 7 వరకు) సందర్భంగా రంగారెడ్డి జిల్లా కొండాపూర్ ఏరియా ఆసుపత్రిలో బుధవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్ మయి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శిశువుకు పుట్టిన గంటలోపే తల్లిపాలు అందించడం అత్యంత అవసరమని తెలిపారు. తొలి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం వరకు తల్లిపాలను కొనసాగిస్తూ వయస్సుకు తగిన పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడమే కాకుండా వ్యాధినిరోధక శక్తిని పెంచి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడతాయని చెప్పారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతపై సమాజంలో మరింత అవగాహన కల్పించేందుకు ఆరోగ్యశాఖ విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రతి గర్భిణీ, బాలింతకు తల్లిపాలపై సరైన అవగాహన కల్పించడం ద్వారా శిశు మరణాలను తగ్గించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా కోఆర్డినేటర్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ అనూరాగిణి రెడ్డి, జిల్లా మహిళా సంక్షేమ అధికారి శాంత శ్రీ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ షీబా హయత్, సీడీపీవో కవిత మాట్లాడుతూ తల్లిపాల వల్ల తల్లి, బిడ్డ ఇద్దరికీ కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ప్రతి తల్లి తన శిశువుకు తప్పనిసరిగా తల్లిపాలను అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి మంజుల, కొండాపూర్ ఏరియా ఆసుపత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయలక్ష్మి, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, బాలింతలు, పాల్గొన్నారు.

# నడిరోడ్డుపై ఘోరం..

హైదరాబాద్లోని సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో దారుణ హత్య చోటుచేసుకుంది. మంగళవారం నాడు సైదాబాద్ లోని సింగరేణి కాలనీలో హమేర్ (35) అనే వ్యక్తిని ఓ యువకుడు నడిరోడ్డుపైనే కొబ్బరికాయలు కొట్టే కత్తితో దాడి చేసి హత్య చేశాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. దాడిలో తీవ్రంగా గాయపడిన హమేర్ను స్థానికులు వెంటనే సమీప ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటన అనంతరం నిందితుడు పరారవగా, అతడి కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. మృతుడిపై గతంలో పలు క్రిమినల్ కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. హత్యకు వ్యక్తిగత విభేదాలే కారణమా, లేక ఇతర కారణాలున్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించిన పోలీసులు ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేశారు. స్థానికంగా మృతుడు, నిందితుడు ఇద్దరికీ గంజాయి ముఠాలతో సంబంధాలు ఉన్నాయనే ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనిపై పోలీసులు ఇప్పటివరకు అధికారి కంగా ఎలాంటి ధృవీకరణ ఇవ్వలేదు.

# మొబైల్ జర్నలిజం -- భవిష్యత్ జర్నలిజానికి నూతన దిశ

**-- నల్లపాటి పార్థసారథి**
**రిటైర్డ్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు (హిందీ)**

ఒకప్పుడు ఉదయం న్యూస్‌పేపర్ కోసం ఎదురుచూసే రోజులు ఉండేవి. కుటుంబమంతా కలిసి పత్రికను చదివి దేశ, రాష్ట్ర, స్థానిక పరిణామాలను తెలుసుకునేది. కానీ నేడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. కష్టపడి కొనుగోలు చేసిన దినపత్రికను ప్రశాంతంగా చదివే సమయం కూడా చాలామందికి దొరకడం లేదు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందడంతో వార్తలను తెలుసుకునే విధానం కూడా పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు టెలివిజన్ రావడంతో సినిమాల భవిష్యత్తుపై సందేహాలు వ్యక్తమయ్యాయి. తరువాత 24 గంటల వార్తా ఛానళ్లు ప్రారంభం కావడంతో దినపత్రికలపై ప్రభావం పడింది. ఇప్పుడు మొబైల్ ఫోన్, సోషల్ మీడియా, డిజిటల్ వేదికల యుగంలో సంప్రదాయ జర్నలిజం మరింత సవాళ్లను ఎదుర్కొంటోంది. భారీ ప్రకటనల ఆదాయం ఉన్న మీడియా సంస్థలు మాత్రమే పోటీ ప్రపంచంలో నిలదొక్కుకో గలుగుతున్నాయి. నిజాయితీతో ప్రజలకు నిష్పాక్షిక సమాచారాన్ని అందించాలనే ఆదర్శంతో పనిచేసే చిన్న, మధ్యతరహా పత్రికల ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారింది. నేటి ప్రపంచం పరస్పర అనుసంధానమైన ప్రపంచం. ఒకప్పుడు స్థానిక వార్తలే ప్రజల జీవితాలను ప్రభావితం చేసేవి. ఇప్పుడు అంతర్జాతీయ పరిణామాలు కూడా మన నిత్యజీవితంపై ప్రత్యక్ష, పరోక్ష ప్రభావం చూపుతున్నాయి. అమెరికా, యూరప్, మధ్యప్రాచ్యం లేదా ఆసియాలో జరిగే రాజకీయ, ఆర్థిక, వాతావరణ మార్పులు భారతదేశంలోని సామాన్యుడి జీవితాన్నీ ప్రభావితం చేస్తున్నాయి. అందువల్ల స్థానిక, జాతీయ, అంతర్జాతీయ వార్తలపై సమగ్ర అవగాహన ప్రతి పౌరునికీ అవసరమైంది. అయితే, సమాచారం పెరిగిన కొద్దీ అపోహలు, అసత్య ప్రచారం, వక్రీకరించిన వార్తలు కూడా పెరిగాయి. సోషల్ మీడియా ద్వారా నిర్ధారణ లేని సమాచారం వేగంగా వ్యాపిస్తోంది. ఫలితంగా ప్రజలు ఉపయోగకరమైన సమాచారాన్ని కోల్పోయి, అనవసరమైన




కాలక్షేప వార్తల వైపు మళ్లుతున్నారు. ఈ పరిస్థితిలో విశ్వసనీయమైన, సంక్షిప్తమైన, ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని సమయానికి అందించడం జర్నలిజం యొక్క ప్రధాన బాధ్యతగా మారింది. ఇక్కడే మొబైల్ జర్నలిజం ప్రాధాన్యం పెరుగుతోంది. నేడు ఒక స్మార్ట్‌ఫోన్‌తోనే వార్తలను సేకరించడం, చిత్రీకరించడం, ఎడిటింగ్ చేయడం, ప్రసారం చేయడం సాధ్యమవుతోంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ మందిని చేరుకునే సామర్థ్యం మొబైల్ జర్నలిజానికి ఉంది. ఇది చిన్న, మధ్యతరహా మీడియా సంస్థలకు, స్వతంత్ర జర్నలిస్టులకు గొప్ప అవకాశాలను అందిస్తోంది. అయితే సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే సరిపోదు. మొబైల్ జర్నలిజంలో విజయం సాధించాలంటే వాస్తవాలను నిర్ధారించే నైపుణ్యం, నైతిక విలువలు, చట్టాలపై అవగాహన, వీడియో నిర్మాణం, కథన రచన, డిజిటల్ ప్రచారం వంటి అనేక అంశాలలో శిక్షణ అవసరం. జర్నలిస్టులు నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ కాలానుగుణంగా మారాలి. భారతదేశం యువశక్తి అధికంగా ఉన్న దేశం. డిజిటల్ వినియోగదారుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో విలువలతో కూడిన మొబైల్ జర్నలిజానికి విస్తృత అవకాశాలు ఉన్నాయి. విశ్వసనీయ సమాచారాన్ని ప్రజలకు అందించే మొబైల్ జర్నలిస్టులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించగలరు. మంచి కంటెంట్‌కు వ్యాపార ప్రకటనలు, ప్రజాదరణ, ఆర్థిక అవకాశాలు కూడా లభించే అవకాశం ఉంది. పోటీ ప్రపంచంలో మనుగడ సాధించాలంటే నిరంతర అభ్యాసం, సాంకేతిక నైపుణ్యాలు, సమిష్టి సహకారం అవసరం. పత్రికా సంస్థలు ఆధునిక జర్నలిజంపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలి. యువ జర్నలిస్టులు వాటిని సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను పెంపొందించుకోవాలి. మొబైల్ జర్నలిజం కేవలం ఒక సాంకేతిక మార్పు కాదు; అది సమాచార విప్లవానికి కొత్త దిశ. నిజాయితీ, బాధ్యత, ప్రజాసేవ అనే విలువలను కాపాడుకుంటూ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించగలిగితే వ్యక్తిగత ప్రగతి మాత్రమే కాదు, దేశాభివృద్ధికి కూడా విశేషంగా దోహదపడుతుంది.

# జూనియర్ కళాశాలల్లో రికార్డు స్థాయిలో అడ్మిషన్లు..

తెలంగాణలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలపై విద్యార్థులు, తల్లిదండ్రుల విశ్వాసం మరింత పెరుగుతోంది. 2026--27 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రికార్డు స్థాయిలో అడ్మిషన్లు నమోదయ్యాయి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (క్లాస్-11)లో మొత్తం 85,453 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందగా, గత విద్యా సంవత్సరంలో ఈ సంఖ్య సుమారు 75 వేలుగా ఉండేది. దీంతో అడ్మిషన్లు దాదాపు 14 శాతం పెరిగాయి. ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి, రెండో సంవత్సరం కలిపి మొత్తం విద్యార్థుల సంఖ్య 1,64,730కు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి (టీజీబీఐఈ) కార్యదర్శి అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నమోదైన ఈ రికార్డు స్థాయి అడ్మిషన్లు ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం నాణ్యమైన, సమగ్ర, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన విద్యను అందించేందుకు విద్యా సంస్కరణలు, ఆధునిక మౌలిక సదుపాయాలు, డిజిటల్ విద్య, విద్యార్థి సంక్షేమ కార్యక్రమాలు, పరిశ్రమలతో భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తోందని చెప్పారు. ఐబీఎం, హెటెరో ఫార్మాస్యూటికల్స్ వంటి ప్రముఖ సంస్థలతో కుదిరిన భాగస్వామ్యాల ద్వారా విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, ఇంటర్న్‌షిప్‌లు, అప్రెంటిస్‌షిప్‌లు, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఈ చర్యలతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు నాణ్యమైన విద్యకు కేంద్రాలుగా మారుతున్నాయని తెలిపారు. విద్యా కార్యక్రమాల సమర్థ అమలు కోసం ఆగస్టు 3న హైదరాబాద్‌లోని టీజీబీఐఈ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో రాష్ట్ర స్థాయి ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్న ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కింద చేపడుతున్న



మౌలిక సదుపాయాల అభివృద్ధి, కంప్యూటర్ గదులు, గ్రంథాలయాలు, ఎకో క్లబ్‌లు, ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు అందించే సౌకర్యాలు, నిధుల పారదర్శక వినియోగంపై అవగాహన కల్పించారు. అలాగే మహిళలపై కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోష్ యాక్ట్-2013)పై ప్రత్యేక శిక్షణా సదస్సులు నిర్వహించారు. ఉద్యోగావకాశాలను పెంచే దిశగా పరిశ్రమలతో భాగస్వామ్యాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఐబీఎంతో కలిసి డిజిటల్ నైపుణ్యాలు, పరిశ్రమ గుర్తింపు పొందిన సర్టిఫికేషన్లు అందిస్తుండగా, హెటెరో ఫార్మాస్యూటికల్స్‌తో అవగాహన ఒప్పందం ద్వారా లైఫ్ సైన్సెస్, వృత్తి విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, ల్యాబ్ సదుపాయాలు, క్యాంపస్ నియామకాల అవకాశాలు కల్పిస్తున్నారు. హెటెరో సంస్థ 300 మందికి పైగా ఇంటర్మీడియట్ అర్హత కలిగిన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముందుకొచ్చింది. ఇప్పటివరకు వివిధ పరిశ్రమల భాగస్వామ్యాల ద్వారా 2,000 మందికి పైగా విద్యార్థులు ఉద్యోగాలు, అప్రెంటిస్‌షిప్‌లు పొందారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యా సంస్కరణలలో భాగంగా మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ సిలబస్‌ను ఎన్‌సీఈఆర్‌టీ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించారు. పాత అంశాలను తొలగించి ఆధునిక అంశాలను చేర్చారు. క్యూ ఆర్ కోడ్‌లతో కూడిన ఇంటరాక్టివ్ పాఠ్యపుస్తకాలు అందుబాటులోకి తీసుకువచ్చి, విద్యార్థులు స్మార్ట్‌ఫోన్‌ల ద్వారా వీడియో పాఠాలు, డిజిటల్ అధ్యయన సామగ్రిని వినియోగించుకునే అవకాశం కల్పించారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా భారీగా నిధులు కేటాయించింది. 40 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆధునిక మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 1.90 కోట్లు, 416 కళాశాలలకు క్రీడా మౌలిక సదుపాయాల కోసం రూ. 1.04 కోట్లు, 418 కళాశాలల్లో ఎకో క్లబ్‌ల కోసం రూ. 10.45 లక్షలు, కంప్యూటర్ గదుల ఏర్పాటు, అభివృద్ధికి రూ. 20 కోట్లకు పైగా, కాంపోజిట్ స్కూల్ గ్రాంట్ల కింద రూ. 2.48 కోట్లు, గ్రంథాలయాల బలోపేతానికి రూ. 41.80 లక్షలు, ప్రయోగశాలల వినియోగ వస్తువులు, ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ కోసం టీజీబీఐఈ నుంచి రూ. 2.34 కోట్లు విడుదల చేశారు. అదనంగా ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, పోషకాహార అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయి. విద్యా ప్రమాణాల పెంపు, ఆధునిక బోధన, డిజిటల్ సౌకర్యాలు, పరిశ్రమలతో అనుసంధానం, విద్యార్థి సంక్షేమ కార్యక్రమాల ఫలితంగానే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు గణనీయంగా పెరిగాయని అధికారులు పేర్కొన్నారు. నాణ్యమైన, అందుబాటులో ఉండే, ఉపాధి అవకాశాలకు దోహదపడే విద్యను అందించే సంస్థలుగా తెలంగాణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు గుర్తింపు పొందుతున్నాయని వెల్లడించారు.

# మహిళా ఉపాధ్యాయిని హత్య ఘటనపై జాతీయ మహిళా కమిషన్ సీరియస్

హర్యానాలోని ఫరీదాబాద్‌లో ఓ ప్రైవేట్ పాఠశాలలో 32 ఏళ్ల మహిళా ఉపాధ్యాయిని కత్తితో దాడి చేసి హత్య చేసిన ఘటనపై జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) సుమోటోగా స్పందించింది. ఈ ఘటన మహిళల కార్యాలయ భద్రత, నిరంతర వేధింపులు (స్టాకింగ్), విద్యాసంస్థల్లో భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని స్పష్టంగా చూపుతోందని కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటనపై జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయా రహత్‌కర్ హర్యానా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌కు లేఖ రాశారు. నిందితుడిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్)లోని సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, వేగవంతమైన, నిష్పాక్షిక దర్యాప్తు నిర్వహించాలని, ఫోరెన్సిక్, సాంకేతిక, ప్రత్యక్ష సాక్ష్యాలను సమగ్రంగా సేకరించాలని కోరారు. బాధితురాలి కుటుంబ సభ్యులు, సాక్షులకు తగిన భద్రత కల్పించడంతో పాటు విద్యాసంస్థల్లో భద్రతా ఏర్పాట్లు, సందర్శకుల ధృవీకరణ విధానాలను సమగ్రంగా సమీక్షించాలని కూడా చైర్‌పర్సన్ సూచించారు. ఈ ఘటనపై తీసుకున్న చర్యల నివేదిక (ఏటీఆర్)ను ఏడు రోజుల్లోగా సమర్పించాలని హర్యానా పోలీసులను ఆదేశించారు. బాధితురాలికి న్యాయం జరిగేలా, ఈ కేసులో పూర్తి బాధ్యతాయుత చర్యలు తీసుకునేలా జాతీయ మహిళా కమిషన్ ఈ వ్యవహారాన్ని నిరంతరం పర్యవేక్షిస్తుందని కమిషన్ వెల్లడించింది.

# సోమనపల్లిలో తీరిన నీటి కష్టాలు

### కాలిపోయిన బోర్ మోటార్ స్థానంలో కొత్తది అమరిక: వేగంగా స్పందించిన సర్పంచ్ తోకల మల్లేష్.




**చెన్నూర్, ఆగస్టు 4 (అర్జున సమాచారశీ ):**

సోమనపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని ఎస్సీ వాడ (కొత్తగూడెం)లో ఎదురవుతున్న తాగునీటి ఎద్దడికి గ్రామ పంచాయితీ పాలకవర్గం తక్షణ పరిష్కారం చూపింది. ఇటీవల కాలనీలోని బోర్ మోటార్ కాలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయి, కాలనీవాసులు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని స్థానికులు పంచాయితీ దృష్టికి తీసుకెళ్లగా, సర్పంచ్ తోకల మల్లేష్ వెంటనే స్పందించారు. పంచాయితీ నిధులతో నూతన బోర్ మోటార్‌తో పాటు కొత్త స్టార్టర్‌ను కొనుగోలు చేయించి, సాంకేతిక సిబ్బంది ద్వారా బోర్ వద్ద అమర్చే పనులను దగ్గరుండి పూర్తి చేయించారు. యుద్ధప్రాతిపదికన మోటార్ మార్పిడి పనులు పూర్తి చేయడంతో కాలనీలో తాగునీటి సరఫరా పునరుద్ధరణకు మార్గం సుగమమైంది. సమస్యను తెలిపిన వెంటనే సానుకూలంగా స్పందించి నీటి తిప్పలు తప్పించిన సర్పంచ్ తోకల మల్లేష్‌తో పాటు పంచాయితీ పాలకవర్గానికి ఎస్సీ వాడ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్, పంచాయితీ కార్యదర్శి, వార్డు సభ్యులు మరియు గ్రామ పంచాయితీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డే పార్కింగ్ స్థలమా..?






## భారీ వాహనాల అక్రమ పార్కింగ్‌తో మంథని ప్రజలకు ఇబ్బందులు

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, ఆగస్టు 4:**

మంథని పట్టణంలో కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు అక్రమ పార్కింగ్‌కు కేంద్రంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మినీ వ్యాన్లు, డీసీఎం వ్యాన్లు గంటల తరబడి రోడ్డుపైనే నిలిపివేయడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ఆరోపిస్తున్నారు. శ్రీపాద చౌక్, గాంధీ చౌక్, అంబేద్కర్ చౌక్, సీఆర్కే అపార్ట్‌మెంట్ ప్రాంతం, పాత పెట్రోల్ బంక్, బస్సు డిపో పరిసరాల్లో రోడ్డుకు ఇరువైపులా భారీ వాహనాలు పార్క్ చేయడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు ఇబ్బందికర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోందని స్థానికులు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు సైతం సకాలంలో వెళ్లలేని పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సౌకర్యం కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన సీసీ రోడ్లను కొందరు శాశ్వత పార్కింగ్ స్థలాలుగా మార్చడం వల్ల ప్రభుత్వ ధనం వృథా అవుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. రోడ్డుపై అక్రమ పార్కింగ్ కారణంగా ప్రజలకు ఇబ్బందులు తప్ప ప్రయోజనం కనిపించడం లేదని పేర్కొంటున్నారు. అక్రమంగా రోడ్డుపై నిలిపివేస్తున్న భారీ వాహనాలపై మున్సిపల్, పోలీసు అధికారులు ఇప్పటివరకు సమర్థవంతమైన చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముందుగా నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహన యజమానులను హెచ్చరించి, ఆ తర్వాత కూడా అక్రమ పార్కింగ్ కొనసాగిస్తే జరిమానాలు విధించడం, అవసరమైతే వాహనాలను స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సీసీ రోడ్లను ఆక్రమణల నుంచి విముక్తం చేసి ప్రజల రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

# పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



**అర్జున్ సమాచారం జులై 04 మంచిర్యాల జిల్లా.ప్రతినిధి:**

మంచిర్యాల:పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్, సాదాబైనామా, భూ భారతి దరఖాస్తులు, రీ-సర్వే పనులు తదితర కార్యక్రమాలను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం తాండూర్ మండలంలోని కార్తికేయ ఇండస్ట్రీస్ రైస్‌మిల్లును రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి పరిశీలించి సీఎంఆర్ బకాయిల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ సీఎంఆర్‌ను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేయాలని మిల్లర్ లను ఆదేశించారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ (ఎస్ఎల్ఆర్) ఎ.డి.తో కలిసి తాండూర్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి పెండింగ్ సాదా బైనామా, భూ భారతి దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. సాదా బైనామా, భూభారతి, రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను రికార్డులను అనుసరించి, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. రాంపూర్ గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే పనుల పురోగతిని తెలుసుకుని, త్వరగా రాంపూర్ రీ-సర్వే ప్రక్రియను పూర్తిచేసి మరో 5 గ్రామాలలో అదనంగా రీ-సర్వే పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న వివిధ ధ్రువపత్రాల దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి త్వరితగతిన జారీ చేయాలని, అన్ని పెండింగ్ పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# అన్నప్రాశన -- తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహణ

## తల్లిపాలే శిశువుకు తొలి టీకా -- సిడిపిఓరాజేశ్వరి

జోగులాంబ గద్వాల్ పట్టణంలోని చింతల్‌పేట సెక్టార్ పరిధిలోని దాదర్‌పల్లి--5,3 అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాశన కార్యక్రమం, ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ రాజేశ్వరి మాట్లాడుతూ, తల్లిపాలే శిశువుకు ప్రకృతి ప్రసాదించిన తొలి ఆహారం, తొలి టీకా అని అన్నారు. పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం, మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల శిశువులకు రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సూపర్వైజర్ వాహిని మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న సేవలను ప్రతి కుటుంబం వినియోగించుకోవాలని కోరారు. చిన్నారుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం తల్లిపాల ప్రాధాన్యంపై ప్రతి తల్లి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. 2వ వార్డు కౌన్సిలర్ లక్ష్మి నరసమ్మ మాట్లాడుతూ, తల్లి, శిశు ఆరోగ్య



పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రతి అర్హత కుటుంబానికి చేరేలా కృషి చేయాలని అన్నారు. తల్లిపాల వారోత్సవాల ద్వారా సమాజంలో అవగాహన పెంపొందడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. 3వ వార్డ్ కౌన్సిలర్ నాగులు యాదవ్ మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతి కుటుంబం గుర్తించాలని, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం నవీన, అంగన్‌వాడీ టీచర్లు రాధిక, నాగశేషమ్మ, హెల్పర్ పావని, ఆశ వర్కర్లు హేమలత, సుజాత, చిట్టెమ్మ, శ్యామల, నర్సమ్మ, సౌజన్య, సురేఖ, గర్భిణీలు, బాలింతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వరి నాట్లు వేసి వినూత్న రీతిలో నిరసన తెలిపిన బిఆర్ఎస్ నాయకులు

అనునిత్యం ప్రజలు రాకపోకలు సాగించే రోడ్డుపై గుంతలు పడడంతో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి కానీ, అధికారుల్లో గానీ చలనం లేదని సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు అన్నారు. సిద్దిపేట మున్సిపల్ పరిధి 16 వ వార్డులో భారీమాం చౌరస్తా నుండి ఎల్లమ్మ గుడికి వెళ్లే రోడ్డు మార్గం పూర్తిగా గుంతల మాయమై నీరు నిలవడంతో బిఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. రోడ్డుపై నిలిచిన నీటి గుంతలలో వరి నాట్లు వేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మాజీ కౌన్సిలర్ బర్ల మల్లికార్జున్ తో కలిసి పాల్గొని మాట్లాడారు. సిద్దిపేట ఎల్లమ్మ గుడి నుండి భారీమామ్ చౌరస్తా వరకు రోడ్డు పరిస్థితి దుర్భరంగా మారిపోయింది అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతుకు వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మరొక వారం రోజుల్లోగా రోడ్డు మరమ్మత్తు పనులు ప్రారంభం కాకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రాజనర్సు హెచ్చరించారు.

# దామరగిద్ద తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్:



నారాయణపేట జిల్లా దామరగిద్ద తహశీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ (డీటీ) ఇద్దరూ లేకపోవడంతో వారు ఎక్కడికి వెళ్లారని సీనియర్ అసిస్టెంట్‌ను ప్రశ్నించారు. వారు ఫీల్డ్ విజిట్‌కు వెళ్లినట్లు సీనియర్ అసిస్టెంట్ వివరించారు. అనంతరం రిజిస్ట్రేషన్ విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్, రోజుకు ఎన్ని రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి, మంగళవారం ఎన్ని రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ ఆవరణలో ఓ మూలన ఫైళ్లను మూటకట్టి ఉంచడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫైళ్లను ప్రత్యేక గదిలో భద్రంగా భద్రపరచకుండా ఇలా నిర్లక్ష్యంగా ఎందుకు ఉంచారని సీనియర్ అసిస్టెంట్‌ను ప్రశ్నించారు. తదనంతరం పక్కనే ఉన్న ఎంపీడీవో కార్యాలయాన్ని కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. మండలంలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి, ప్రస్తుతం చేపడుతున్న ఉపాధి హామీ పనులు ఏమిటి, ఫామ్ పాండ్ల నిర్మాణాలు ఎంతవరకు పూర్తయ్యాయనే వివరాలను ఎంపీడీవో సాయిలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత దామరగిద్ద తండాలో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని, ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్యపై ఆరా తీశారు. ఈ సందర్భంగా తండాకు నూతన పాఠశాల భవనాన్ని మంజూరు చేయాలని సర్పంచ్ శరణ్ నాయక్ కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నందున తండా విద్యార్థులను దామరగిద్ద మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పంపే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. అయితే మండల కేంద్రంలోని పాఠశాలకు వెళ్లేందుకు తండా విద్యార్థులు ఆసక్తి చూపరని, తద్వారా గైర్హాజరు అయ్యే అవకాశముందని సర్పంచ్ వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, తండాకు రెండు ప్రైవేట్ పాఠశాల బస్సులు వస్తున్నాయని, వాటిలో విద్యార్థులు వెళ్తున్నప్పుడు ప్రభుత్వ పాఠశాలకు ఎందుకు వెళ్లలేరని ప్రశ్నించారు.
ఎలాగైనా తండాకు నూతన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని మంజూరు చేయాలని సర్పంచ్ శరణ్ నాయక్ మరోసారి కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.

# స్వచ్ఛ విద్యాలయ పురస్కారం ఉపాధ్యాయుల అంకిత భావానికి పట్టం

నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన స్వచ్ఛ విద్యాలయ పురస్కారం కోసం ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి గౌడ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయ మని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి అన్నారు. పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ సేకరణ కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా నంగునూరు ఉన్నత పాఠశాలను సందర్శించిన పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి గౌడ్ ను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వంగ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన కార్యక్రమాల ఫలితంగా ఈ అరుదైన గౌరవం పాఠశాలకు దక్కిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం ఉపాధ్యాయుల అంకితభావానికి నిదర్శనమని అన్నారు.

# ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్సీ రెసిడెన్స్ అధికారి నాగరాజు

జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్సీ రెసిడెన్స్ అధికారి నాగరాజు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ పరిధిలో అమలవుతున్న విద్యార్థుల సంక్షేమ కార్యక్రమాలు, వసతి గృహాల నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఎమ్మెల్యేతో చర్చించినట్లు తెలిసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందేలా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించినట్లు సమాచారం. జిల్లాలో ఎస్సీ విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమం కోసం అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, శాఖ సూపర్డెంట్ మల్లికార్జున్, వార్డెన్లు కృష్ణయ్య, సుజాత, రామకృష్ణ, శ్రీనివాస్, రమేష్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 10న జైల్ బరో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం:

నారాయణపేట: కార్మిక, కర్షక హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఆగస్టు 10న జరిగే జైల్ బరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి అనురాధ తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆశా కార్యక్రమానికి భాగస్వామ్యంగా పాల్గొనలనే నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మంగళవారం మరికల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ రాఘవేందర్ రెడ్డికి ఆశా యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసారు. అప్పుడు అనురాధ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం పూర్వం నుండి కార్మికులు పొందిన హక్కులను ప్యాచ్ రూపంలో మార్చి నాలుగు లేబర్ కోడ్లను యజమానులకు అనుకూలంగా తీర్చిదిద్దారని తీవ్రంగా విమర్శించారు. దేశీయ కార్మిక హక్కులను కేంద్ర ప్రభుత్వం తగ్గించాలని చర్యలు తీసుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల విషయంలో కూడా ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపకపోవడం సరి కాదన్నారు. అన్నదాతలకు కనీస మద్దతు ధర (మీస్రా)ను చట్టబద్ధం చేయాలని చాలా మంది రైతులు డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పక్కన పెడుతున్నట్టేనని వ్యాఖ్యానించారు. ఉపాధి హామీపై కూడా మాటలే మిగిలి, పాట్లు లేకుండా వాగ్దానాలతో రైతు-కూలీల పరిస్థితిని క్షీణింపజేస్తున్నట్లు అన్నారు. అనురాధ కోరినట్లు, కార్మిక-రైతుల హక్కుల కోసం దేశవ్యాప్తంగా వివిధ కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రాల్లో కోర్యం "క్విట్ ఇండియా" ఉద్యమ స్ఫూర్తితో నిర్వహించే నిరసన ర్యాలీలు, జైల్ బరో కార్యక్రమాల్లో జిల్లా వ్యాప్తంగా ఆశా నాయకులు, కార్యకర్తలు పాల్గొననున్నారు.

PRGI NO: TGTEL/25/A5514
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక

సినిమా
CINEMA



# సూర్య ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్.. 'విశ్వనాథ్ ఢ సన్స్'

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రస్తుతం ఫుల్ జోష్‌లో ఉన్నారు. ఇటీవల విడుదలైన 'కరుప్పు' బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవడంతో ఆయన కెరీర్ మళ్లీ సక్సెస్ ట్రాక్‌లోకి వచ్చింది. ఈ విజయోత్సాహంలో ఉన్న సూర్య, ఇప్పుడు తన తదుపరి చిత్రం 'విశ్వనాథ్ ఢ సన్స్' విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో మమితా బైజు కథానాయికగా నటించగా, ఆగస్టు 14, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. ప్రీ-రిలీజ్ బజ్ కూడా పాజిటివ్‌గా ఉండటంతో, ఈ ఏడాది సూర్యకు మరో విజయాన్ని అందిస్తుందనే నమ్మకంతో అభిమానులు ఉన్నారు.ఇదిలా ఉండగా, తన 47వ సినిమాకు సంబంధించి సూర్య తాజాగా ఆసక్తికరమైన అప్‌డేట్ ఇచ్చారు. ప్రముఖ దర్శకుడు జితు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని ఆయన వెల్లడించారు. ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ఈ చిత్రాన్ని 2026 ముగిసేలోపే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నామని తెలిపారు. ఈ సినిమాను సూర్య సొంత నిర్మాణ సంస్థ 2డి ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే సినిమా టైటిల్‌తో పాటు విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఇప్పటికే 'కరుప్పు'తో భారీ విజయాన్ని అందుకున్న సూర్యకు, 'విశ్వనాథ్ ఢ సన్స్'పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం కూడా ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకుంటే, జితు మాధవన్ దర్శకత్వంలో వస్తున్న 47వ సినిమా విడుదలతో సూర్య వరుసగా మూడు విజయాలను ఖాతాలో వేసుకునే అవకాశం ఉంది.







# 'రామాయణ'లో శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్..

నితీష్ తివారీ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం రామాయణం పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. భారతీయ ఇతిహాసాన్ని అత్యాధునిక సాంకేతికతతో తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో పలువురు స్టార్ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ముఖ్యంగా శూర్పణఖ పాత్రలో నటిస్తున్న రకుల్ ప్రీత్ సింగ్ లుక్ ఇటీవల విడుదలైన ప్రచార చిత్రాలతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ట్రైలర్‌లో రకుల్ కనిపించిన తీరు, ఆమె ప్రత్యేకమైన గెటప్, ఆభరణాలు, కాస్ట్యూమ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇప్పటివరకు తెరపై కనిపించిన శూర్పణఖ పాత్రలకు భిన్నంగా ఈ పాత్రను అత్యంత గ్రాండ్‌గా డిజైన్ చేసినట్లు అభిమానులు అభిప్రాయపడుతున్నారు. పాత్రలోని గంభీరత, రాజసాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన లుక్‌కు నెటిజన్ల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# దేవుడు ఇచ్చిన విరామం!



ఇటీవల 'మైసా' సినిమా కోసం డ్యాన్స్ రిహార్సల్ చేస్తున్న సందర్భంలో తీవ్రంగా గాయపడింది అగ్ర కథానాయిక రష్మిక మందన్న. డాక్టర్లు ఆరు వారాల విశ్రాంతిని సూచించారు. వారి సలహా మేరకు ప్రస్తుతం ఆమె విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తన కాలి గాయంపై రష్మిక మందన్న ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందిస్తూ ఓ పోస్ట్ పెట్టింది. 'గాయాలు కావడం చిరాకుగా అనిపిస్తుంది. అసలు ఈ గాయం గురించి ఎవరికీ తెలియకూడదనుకున్నా. కానీ తెలిసిపోయింది. ఇలాంటి గాయం కావడం ఇది మూడోసారి. ఎవరూ టెన్షన్ పడొద్దు. ఈ గాయం నొప్పిగా అనిపిస్తున్నా..భరించలేనంతగా ఏమీ లేదు. నేను షూటింగ్స్‌లో బిజీగా ఉంటూ విరామం తీసుకోవడం లేదనే కారణంతో.. దేవుడు ఈ గాయాన్ని చేసి నా వృత్తికి విరామాన్ని ఇచ్చాడేమో అనుకుంటున్నా' అంటూ స్మైలీ ఏమోజీలతో రష్మిక మందన్న చేసిన ఈ పోస్ట్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ప్రస్తుతం ఆమె రణబాలి, మైసా చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది



# 'అలియాస్ రుక్మిణీ' ప్రారంభం

నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రానికి 'అలియాస్ రుక్మిణీ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. గత ఏడాది 'కోర్ట్' వంటి సక్సెస్‌ఫుల్ మూవీ తర్వాత హీరో నాని సమర్పణలో యునానిమస్ ప్రొడక్షన్ పతాకంపై రెండో ప్రయత్నంగా ఈ తాజా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకుడు. దీప్తి గంటా నిర్మాత. సోమవారం ఈ చిత్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ముహూర్తపు సన్నివేశానికి నాని క్లాప్‌నివ్వగా, నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి కెమెరా స్విఛాన్ చేశారు. ఇదొక అందమైన ప్రేమకథ అని, ప్రేక్షకులకు చాలాకాలం గుర్తుండిపోతుందని, త్వరలో షూటింగ్ ప్రారంభిస్తామని నాని తెలిపారు. "కోర్ట్' తర్వాత ఎన్నో కథలు విన్నాం. ఈ కథలో కొత్తదనం బాగా నచ్చింది. కథానాయకుడు కృష్ణ పాత్ర కోసం సరైన హీరోని వెతుకుతున్న టైంలో 'నితిన్ అన్నను అడుగుదాం' అని నాని సలహా ఇచ్చారు. కృష్ణ పాత్రకు నితిన్ పర్‌ఫెక్ట్‌గా సరిపోయారు' అని నిర్మాత దీప్తి గంటా చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: జోమోన్ టి జాన్, సంగీతం: విజయ్ బుల్గానిన్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, రచన-దర్శకత్వం: మురళీకాంత్ దేవసోత్.

# కార్తి హీరోగా మోహన్‌రాజా చిత్రం

తమిళ అగ్ర హీరో కార్తి కథానాయకుడిగా మోహన్‌రాజా దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా సినిమా తెరకెక్కనున్నది. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్.లక్ష్మణ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ సినిమాకు చెందిన ప్రకటనను సోమవారం మేకర్స్ విడుదల చేశారు. కుటుంబ భావోద్వేగాలతో పాటు హీరోయిజాన్ని మేళవించిన ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉండబోతున్నదని వారు తెలిపారు. దేవ్, సర్దార్, సర్దార్ 2 చిత్రాల తర్వాత ప్రిన్స్ పిక్చర్స్ సంస్థలో కార్తి నటిస్తున్న నాలుగో చిత్రమిది. కార్తి, మోహన్‌రాజా కాంబినేషన్‌లో వస్తున్న తొలి చిత్రం ఇదే కావడం విశేషం. ఇందులో కార్తి పవర్‌ఫుల్ అవతారంలో కనిపిస్తారని మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక బృందం, షూటింగ్ వివరాలను త్వరలో ప్రకటించనున్నారు.



# శంకర్ కుటుంబానికి అండగా నిలిచిన దుర్గం అశోక్

### బియ్యం అందజేసి ప్రగాఢ సానుభూతి వ్యక్తం



**అర్జున్ సమాచారం జులై 04 మంచిర్యాల జిల్లా.ప్రతినిధి:**

కోటపల్లి: మండల కేంద్ర గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య విభాగంలో విధులు నిర్వహించిన కత్తర్ల శంకర్ స్వర్గస్తులై మూడో రోజు సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుర్గం అశోక్ శంకర్ కుటుంబానికి యాభై కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి దుఃఖంలో తాము భాగస్వాములమని పేర్కొంటూ ధైర్యం చెప్పారు. కుటుంబానికి అవసరమైన సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి మండల ప్రధాన కార్యదర్శి కందుల వెంకటేష్, కోటపల్లి గ్రామ భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడు సుందిళ్ల సాయికుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని స్వర్గీయ కత్తర్ల శంకర్‌కు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఆదివాసీలపై దాడులు ఆపాలి.. అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలి.

### జైపూర్ మండల కేంద్రంలో నాయకపోడు హక్కుల పరిరక్షణ కమిటీ నిరసన!



**అర్జున్ సమాచారం జులై 04 మంచిర్యాల జిల్లా.ప్రతినిధి:**

జైపూర్:ఆగస్టు 04: జైపూర్ మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివాసీ నాయకపోడు హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా, మండల నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి భీముని సంజీవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు గంజి రాజన్న మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల పట్ల కక్షపూరిత వైఖరి అవలంబిస్తున్నాయని ఆరోపించారు. జిల్లాలోని అటవీ సంపదను ప్రైవేటు పారిశ్రామిక సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఆ చర్యల్లో భాగంగానే చీఫ్ కన్సర్వేటర్ శాంతారామ్ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు మండలాల్లో అటవీ అధికారులు దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇందన్‌పల్లి గ్రామానికి చెందిన ఆదివాసీ నాయకపోడు యువకులపై అటవీ శాఖ అధికారులు దాడి చేశారని ఆరోపిస్తూ, సంబంధిత అటవీ అధికారిపై నేర కేసు నమోదు చేయాలని, విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలకు బాధ్యుడిగా పేర్కొంటున్న చీఫ్ కన్సర్వేటర్ శాంతారామ్‌ను రాష్ట్రం నుంచి బదిలీ చేయాలని కోరారు. ఈ నెల 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గడువుగా ప్రకటిస్తున్నామని, అప్పటిలోగా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే ఖానాపూర్ శాసనసభ్యుడు, ఆదివాసీ ఉద్యమకారుడు వెడ్మబొజ్జు పటేల్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బైర్నేని అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి భీముని సంజీవ్, జిల్లా నాయకుడు భూమిని రాజన్న, ఉపాధ్యక్షుడు శేఖర్, సాంస్కృతిక కార్యదర్శి బైర్నేని పోశం, సంయుక్త కార్యదర్శి కుమార్, యువజన అధ్యక్షుడు డైనేని రఘు, మండల నాయకులు భీముని రమేష్, రాజబాబు, యువజన నాయకుడు పాత ప్రశాంత్ పాల్గొన్నారు.

# త్రాగు నీటిని వృధా చేయవద్దు.. హరిపురం సర్పంచ్ సమత

**అర్జున్ సమాచారం/ముత్తారం రిపోర్టర్**

స్వచ్ఛమైన నీటిని తాగునీరు కొరకు సరఫరా చేస్తున్నామని గ్రామస్తులు త్రాగునీటిని వృధా చేయవద్దని హరిపురం సర్పంచ్ మెంగాని సమత తిరుపతి తెలిపారు. మంగళవారం రోజున సర్పంచ్ సమత సిబ్బందితో కలిసి త్రాగునీరు అందించే పైపులైను పరిశీలించారు గ్రామంలోని వాటర్ ట్యాంకును ఖాళీ చేయించి బ్లిచింగ్ పౌడర్ చల్లించి క్లోరినేషన్ చేపట్టారు ఈ సందర్భంగా గ్రామస్తులకు త్రాగే నీరు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు కలుషితమైన నీటిని తాగడం వల్ల అనారోగ్య పాలవుతారని స్వచ్ఛమైన నీటిని మాత్రమే వాడాలని అన్నారు గ్రామంలో తాగునీటి వసతులను ఎప్పటికప్పుడు పరివేక్షిస్తూ స్వచ్ఛమైన తాగునీటి అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు



# తెలప్రోలు వద్ద ఘోర ప్రమాదం

### డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టిన ప్రైవేటు బస్సు

### 25 మంది ప్రయాణికులకు గాయాలు – ఏడుగురి పరిస్థితి విషమంచెన్నై నుంచి వైజాగ్ వెళ్తుండగా అర్ధరాత్రి దాటాక ప్రమాదంక్షతగాత్రులు పిన్నమనేని ఆస్పత్రికి తరలింపు

**ఉంగుటూరు, ఆగస్టు 4**

ఉంగుటూరు మండలం తెలప్రోలు సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. చెన్నై నుంచి వైజాగ్‌కు 25 మంది ప్రయాణికులతో వెళ్తున్న'బి.ఎల్.ఎమ్' (దీూవీ) ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేట్ బస్సు అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. అనంతరం రహదారిపైనే పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 25 మందిగాయపడగా, వారిలో ఏడుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం.ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా అరుపులు, కేకలతో తీవ్ర భయాందోళనకుగురయ్యారు. బస్సు మితిమీరిన వేగంతో ప్రయాణించడం వల్లే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడిందని ఘటనా స్థలంలో ఉన్న ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.



ప్రమాదంపై సమాచారం అందుకున్నవెంటనే ఉంగుటూరు పోలీసులు, 108 అత్యవసర సేవల సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను బస్సు అద్దాలు పగలగొట్టి వెలుపలికి తీశారు. గాయపడిన 18మంది స్వల్ప గాయాలతో బయటపడగా, తీవ్రంగా గాయపడిన ఏడుగురిని తక్షణ చికిత్స నిమిత్తం పిన్నమనేని సిద్ధార్థ ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని ఆసుపత్రివర్గాలు వెల్లడించాయి. ఈ ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు వెంటనే స్పందించి క్రేన్‌సహాయంతో బోల్తా పడిన బస్సును రోడ్డుపై నుంచి పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యమేకారణమా లేక బస్సులో ఏవైనా సాంకేతిక లోపాలు తలెత్తాయా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు

# ఆయిల్ పామ్ లో అంతర పంటల సాగుతో రైతులకు నిరంతర ఆదాయం.. ఏవో.జే.అనూష



**అర్జున్ సమాచారం. ఆగస్టు 4 /ముత్తారం, రిపోర్టర్**

ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటల సాగు ద్వారా రైతులు నిరంతర ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయ అధికారిణి జె.అనూష తెలిపారు. మండలం లోని మైదశీబండ గ్రామానికి చెందిన రైతు బియ్యని లింగం సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను ఏవో జే అనూష క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా ూా. ూ.అనూష ఆయిల్ ఫామ్ రైతులకు పలు సూచనలు చేశారు ఆయిల్ పామ్ మొక్కలు పూర్తిగా పెరిగే ప్రారంభ సంవత్సరాల్లో ఖాళీ స్థలాన్ని సద్వినియోగం చేసుకుంటూ అంతర పంటలు సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని రైతులకు సూచించారు. ఆయిల్ పామ్ తోటల్లో కంది, పెసర, మినుము వంటి పప్పుధాన్య పంటలతో పాటు నువ్వులు, పొద్దుతిరుగుడు వంటి నూనెగింజల పంటలు, కాకర, బీరకాయ, సొరకాయ, బెండకాయ వంటి కూరగాయ పంటలను అంతర పంటలుగా సాగు చేయడం వల్ల రైతులకు ఏడాది పొడవునా ఆదాయం లభిస్తుందని తెలిపారు. నేల సారవంతత మెరుగుపడటంతో పాటు ఖాళీ భూమి సద్వినియోగం అవుతుందని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు , బిందు సేద్యం (డ్రిప్ ఇరిగేషన్)పై రాయితీలు అందిస్తున్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఆయిల్ పామ్ సాగు, అంతర పంటల ఎంపిక, సాంకేతిక సూచనల కోసం రైతులు వ్యవసాయ శాఖ లేదా ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు (ూజుూలు) బి. శశిధర్, మనీషా రైతులు పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువులకు తొలి రక్షణ.. పోషకాహారంతో ఆరోగ్యవంతమైన ఎదుగుదల.

### టేకుమట్ల అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు -- అన్నప్రాసన నిర్వహణ

**అర్జున్ సమాచారం జులై 04 మంచిర్యాల జిల్లా.ప్రతినిధి:**

జైపూర్ఆ:గస్టు 04: మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం టేకుమట్ల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మంగళవారం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సమీకృత శిశు అభివృద్ధి సేవల పర్యవేక్షకురాలు గాయత్రి మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యత, శిశువులకు తల్లిపాల



ద్వారా లభించే పోషక విలువలు, చిన్నారుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు సమతుల్య పోషకాహారం అవసరాన్ని వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న టేకుమట్ల గ్రామ సర్పంచ్ బల్ల వెంకటేష్ గర్భిణీలు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిన్నారులకు పోషకాహారం అందించాల్సిన అవసరం, ఆరోగ్యకరమైన పెరుగుదల కోసం పాటించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు వరలక్ష్మి, సునీత, శ్రీవాణి, యమునా, సహాయకురాలు నీల, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.. ప్రమాదం నుంచి అంత్యక్రియల వరకు బాధిత కుటుంబాలకు అండ..

**జగిత్యాల ప్రతినిధి ::అర్జున్ సమాచారం ఆగస్టు 4::**

జగిత్యాల జిల్లా మల్యాల ఎస్సీ హాస్టల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రమాదవశాత్తూ మృతి చెందిన ఘటనలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మానవత్వాన్ని చాటుకున్నారు. ఘటన తెలిసిన వెంటనే అధికారులను అప్రమత్తం చేసి, అంత్యక్రియలు పూర్తయ్యే వరకు బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలిచారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఒక్కొక్కరికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే తక్షణ సహాయంగా రూ.25 వేల నగదు అందించడంతో పాటు మృతదేహాలను స్వగ్రామాలకు తరలించేందుకు ప్రభుత్వ అంబులెన్స్‌లను ఏర్పాటు చేయించారు. విదేశీ పర్యటనలో ఉన్నప్పటికీ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ బాధిత కుటుంబాలకు సహాయం అందేలా చర్యలు తీసుకోవడం పట్ల పలువురు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.



# గ్రామపంచాయతీ సిబ్బందికి రెయిన్‌కోట్లు, గొడుగుల పంపిణీ



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, ఆగస్టు 4:**

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ సిబ్బందికి మంగళవారం సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు రెయిన్‌కోట్లు, గొడుగులను పంపిణీ చేశారు. వర్షాకాలంలో విధులు నిర్వహించే సమయంలో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామపంచాయతీ సిబ్బంది ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా ప్రజలకు సేవలందిస్తారని, వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని రెయిన్‌కోట్లు, గొడుగులను పంపిణీ చేసినట్లు తెలిపారు. వర్షాకాలంలో విధుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన రక్షణ సామగ్రిని అందించడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని అభినందించిన గ్రామపంచాయతీ సిబ్బంది సర్పంచ్‌కు కృతజ ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి గంగుల సంతోష్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి జిల్లా ట్రెజరీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కె. రమేష్

# జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను మర్యాదపూర్వకంగా కలిసిన అధికారి

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, ఆగస్టు 4:**

పెద్దపల్లి జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సహాయ ట్రెజరీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కె. రమేష్‌కు ఇన్‌చార్జి జిల్లా ట్రెజరీ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించబడిన సందర్భంగా మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కె. రమేష్ జిల్లా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లా ట్రెజరీ కార్యాలయ నిర్వహణ, ప్రభుత్వ ఆర్థిక లావాదేవీల నిర్వహణ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే అంశాలపై చర్చించారు. ఇన్‌చార్జి జిల్లా ట్రెజరీ అధికారిగా బాధ్యతలు చేపట్టిన కె. రమేష్‌కు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ సేవల అమలులో పారదర్శకత, సమర్థతకు ప్రాధాన్యత ఇస్తూ ట్రెజరీ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.



Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthami-nagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.